RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | మంగళవారం, నవంబరు 3, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 175 | పేజీలు: 8 | వెల : రూ.1



## నవంబర్ 11 నుంచి కేటీఆర్ బస్సు యాత్ర

### 29న భారీ బహిరంగ సభ

# తెలంగాణను ఏటీఎంగా మార్చుకున్న కాంగ్రెస్

### ఎస్ఐఆర్‌ను అడ్డుకోవడానికి కుట్రలు చేస్తోంది

### తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుంది: కేంద్ర హోంమంత్రి అమిత్ షా





హైదరాబాద్, నవంబర్ 2: తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఏటీఎంగా మార్చుకుందని, రాష్ట్రంలో 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో వసూళ్లకు పాల్పడుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ) ప్రక్రియను అడ్డుకోవడానికి కుట్రలు చేస్తోందని విమర్శించారు. తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో బీజేపీ నిర్వహించిన మహాపాదయాత్ర ముగింపు సందర్భంగా సోమవారం మొజంజాహీ మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు. బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీ ఎదురుగా ఉన్న డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ప్రారంభమైన మహాపాదయాత్ర అబిడ్స్ మీదుగా మొజంజాహీ మార్కెట్ వరకు సాగింది. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లక్ష్యంగా 'లోక్‌తంత్ర బచావో – అరాజకతా హటావో' నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను అమిత్ షా ఖండించారు. దేశంలో 13 కోట్ల ఓట్లు తొలగించారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. చనిపోయినవారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు, డూప్లికేట్ నమోదులు వంటి కారణాలతో ఓటర్ల జాబితాలో మార్పులు జరుగుతున్నాయని వివరించారు. నకిలీ, బహుళ ఓటర్ల నమోదులను తొలగించడాన్ని కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోందని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. భారత పౌరులకే దేశంలో ఓటు హక్కు ఉండాలని స్పష్టం చేశారు.

ఈవీఎంలపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను కూడా ఆయన ప్రస్తావించారు. ఈవీఎంల వల్లే అక్రమాలు జరుగుతున్నాయన్నది కాంగ్రెస్ వాదన అయితే, తెలంగాణ, కేరళ, హిమాచల్‌ప్రదేశ్‌లో ఆ పార్టీ ఎలా విజయం సాధించిందని ప్రశ్నించారు. బీజేపీ గెలిచినప్పుడు మాత్రమే ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేయడం సరికాదని విమర్శించారు. 2014, 2019లో ప్రధాని నరేంద్ర మోదీ సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ, మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ, అసోం, బిహార్, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయాలు ప్రజల మద్దతుతోనే సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించారని అమిత్ షా గుర్తుచేశారు. హైదరాబాద్ విమోచన చరిత్రను ప్రస్తావిస్తూ పటేల్ సేవలను కొనియాడారు. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణం, ట్రిపుల్ తలాక్ రద్దు, ఉగ్రవాదం, నక్సలిజంపై చర్యలను మోదీ ప్రభుత్వ విజయాలుగా పేర్కొన్నారు. దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపైనా అమిత్ షా ప్రశ్నలు సంధించారు. రాష్ట్రాన్ని రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం కాంగ్రెస్ నాయకత్వం వినియోగించుకుంటోందని ఆరోపించారు. తెలంగాణలో 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా బలహీనపడుతోందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్, ఈవీఎంలు, అక్రమ చొరబాట్లు తదితర అంశాలపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి చర్చించేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని అమిత్ షా ప్రకటించారు. ప్రతిపక్షాలు పార్లమెంట్ కార్యకలాపాలకు ఆటంకం కలిగించకుండా చర్చల్లో పాల్గొనాలని సూచించారు. రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ, నిజమైన పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతగా తన బాధ్యతలను నిర్వర్తించాలని వ్యాఖ్యానించారు.

తెలంగాణలో బీజేపీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు మరింత కృషి చేయాలని అమిత్ షా పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను, రాజ్యాంగ సంస్థలను, ఓటర్ల జాబితా ప్రామాణికతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సభకు ముందు అమిత్ షా బేగంపేట విమానాశ్రయానికి చేరుకోగా, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం చార్మినార్ సమీపంలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ మహాపాదయాత్ర, బహిరంగ సభలో కేంద్ర మంత్రులు జి. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గద్దం నగేశ్, ధర్మపురి అరవింద్, డాక్టర్ కె. లక్ష్మణ్, మాధవనేని రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పాయల్ శంకర్, ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, సి. అంజిరెడ్డి, తెలంగాణ బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రహదారుల పనులు వేగవంతం చేయాలి

### టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఈ ఏడాదిలోనే అందుబాటులోకి రావాలి

### ఆర్ అండ్ బీ అధికారులకు మంత్రి ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్ 2:ఐ రాష్ట్రవ్యాప్తంగా రహదారుల నిర్మాణ పనులతో పాటు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. డా. బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆర్ అండ్ బీ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి పలు ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న రహదారుల పనులు, హామ్ రోడ్లు, ఉస్మానియా, నిమ్స్ ఆస్పత్రుల విస్తరణ, నూతన హైకోర్టు భవన నిర్మాణాలపై సమీక్షించారు. ఆల్వాల్ టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణ పనులను వేగవంతం చేసి, ఈ ఏడాదిలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 19 నుంచి 22 వరకు హైదరాబాద్ హైటెక్స్‌లో జరగనున్న 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) సదస్సు ఏర్పాట్లపైనా ప్రత్యేకంగా చర్చించారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ సదస్సును రాష్ట్ర అభివృద్ధి, మౌలిక వసతులు, పెట్టుబడుల అవకాశాలను ప్రపంచానికి చాటేలా నిర్వహించాలని సూచించారు. ప్రత్యేక తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు చేయాలని, డిసెంబర్‌లో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ' గ్లోబల్ సమ్మిట్‌కు ఈ సదస్సును ప్రచార వేదికగా వినియోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దోహదపడేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

# ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

### డిసెంబర్ 11 నుంచి 22 వరకు పోటీలు..

### అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

### 20 వేదికల్లో 27 క్రీడాంశాలు..

### కర్రసామును చేర్చేందుకు కార్యాచరణ



హైదరాబాద్: డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. క్రీడల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు ఉండాలని సీఎం స్పష్టం చేశారు. అత్యున్నత ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేయాలని, తెలంగాణ సంప్రదాయ క్రీడ అయిన కర్రసామును అతిథ్య రాష్ట్ర కోటాలో పోటీల్లో చేర్చేందుకు వెంటనే కార్యాచరణ చేపట్టాలని సూచించారు. క్రీడల నిర్వహణ బాధ్యతలను గ్రూప్-1 స్థాయి అధికారులకు అప్పగించాలని, వివిధ జిల్లాల్లో జరిగే పోటీల పర్యవేక్షణకు స్థానిక అధికారులను నియమించాలని ఆదేశించారు. క్రీడాకారులకు వసతి, ఇతర సౌకర్యాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, నిర్వహణ పురోగతిపై ప్రతి వారం నివేదిక ఇవ్వాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రారంభ, ముగింపు వేడుకల్లో అనవసర ఆడంబరాలకు దూరంగా ఉండాలని చెప్పారు. హైదరాబాద్ సహా రాష్ట్రంలోని ఆరు నగరాల్లో 20 వేదికలపై 27 రకాల క్రీడా పోటీలు, ఒక డెమో పోటీ నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా వేలాది మంది యువ క్రీడాకారులతో పాటు సుమారు 2 వేల మంది కోచింగ్ సిబ్బంది, అధికారులు పాల్గొననున్నారు. తెలంగాణ క్రీడాకారులు మెరుగైన ప్రదర్శన కనబరిచేలా అవసరమైన శిక్షణ, సదుపాయాలు కల్పించాలని సీఎం సూచించారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించే లక్ష్యంతో అంతర్జాతీయ ప్రమాణాల మౌలిక వసతులు, శిక్షణను అందించేందుకు ఈ పోటీలను అవకాశంగా మలుచుకోవాలని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లలో వినియోగించే వనరులను ఖేలో ఇండియా నిర్వహణకు కూడా ఉపయోగించుకోవాలని సూచించారు. క్రీడారంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మురసు తుపానుపై పవన్ కల్యాణ్ సమీక్ష

### 4 జిల్లాలపై తీవ్ర ప్రభావం.. యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

### లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి.. అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశాలు





అమరావతి: మురసు తుపాను ముప్పు నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తుపాను ప్రభావం, ముందస్తు జాగ్రత్తలు, అత్యవసర సహాయక చర్యలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులతో చర్చించారు. యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా జిల్లాలపై తుపాను తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. భారీ వర్ష సూచన ఉన్న ప్రాంతాల్లో ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి, అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వాగులు, వంకలు, వరద ప్రవాహ ప్రాంతాల వద్దకు ప్రజలు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తుపాను ప్రభావం తగ్గిన వెంటనే విద్యుత్, తాగునీటి సరఫరాను పునరుద్ధరించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండి, సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు.

# జాయింట్ సర్వేతో భూ సరిహద్దు వివాదాలకు చెక్!

### రెవెన్యూ, అటవీ భూములపై సమన్వయంతో సర్వేలు నిర్వహించాలి

### రైతులు, సామాన్యులకు నష్టం జరగకుండా చర్యలు.. అధికారులకు ఉన్నతస్థాయి సమీక్షలో సూచనలు



హైదరాబాద్: రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దుల విషయంలో నెలకొన్న వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జాయింట్ సర్వేలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. డా. బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ, అటవీ, సర్వే అండ్ సెటిల్‌మెంట్ విభాగాల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, అటవీ అధికారులు సమన్వయంతో సర్వేలు చేపట్టాలని, ఈ ప్రక్రియలో రైతులు, సామాన్య ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పద్ధతులను వినియోగించి భూముల హద్దులను కచ్చితంగా గుర్తించాలని స్పష్టం చేశారు. తద్వారా భవిష్యత్తులో సరిహద్దులపై వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా, మండల స్థాయిల్లో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానిక రైతులు, ప్రజల సహకారంతో సర్వే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. భూ రికార్డుల్లో పారదర్శకత, కచ్చితత్వం పెంపొందించడంతో పాటు దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని సమావేశంలో పేర్కొన్నారు. ఇందుకోసం సర్వే, సెటిల్‌మెంట్, భూ రికార్డుల శాఖ ద్వారా సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.

# మంత్రి పదవి ఇవ్వలేదు.. నిధులూ రావడం లేదు!

### రేవంత్ ప్రభుత్వంపై కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తి



నల్గొండ, నవంబర్ 2: తెలంగాణ కాంగ్రెస్‌లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి సొంత ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి పదవి ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి విజ్ఞప్తి చేసినా నియోజకవర్గానికి నిధులు విడుదల కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైతే ఎమ్మెల్యే పదవిని సైతం వదులుకోవడానికి సిద్ధమని ప్రకటించారు. గట్టుప్పల్ మండలంలో పర్యటించిన ఆయన మాట్లాడుతూ.. మంత్రి పదవి ఇస్తామని చెప్పి మాట తప్పారని విమర్శించారు. మనసు చంపుకొని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని కలిసినా ఫలితం లేకపోయిందన్నారు. తనకు మంత్రి పదవి ఇస్తే ఎదుగుతాననే ఉద్దేశంతోనే పదవి ఇవ్వడం లేదని వ్యాఖ్యానించారు. మునుగోడు అభివృద్ధికి నిధులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ నిధుల కోసం ప్రతిపక్ష ఎమ్మెల్యేలాగా పోరాడాల్సి వస్తోందని పేర్కొన్నారు. రోడ్ల పనులకు టెండర్లు పిలుస్తున్నా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోతున్నాయని చెప్పారు. ప్రస్తుత పనులకే నిధులు ఇవ్వలేని పరిస్థితిలో కొత్త పనులు ఎలా చేపడతారని ప్రశ్నించారు. మునుగోడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి జరగకపోతే పదవులను పట్టుకుని వేలాడబోనని, అవసరమైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు కూడా వెనుకాడబోనని స్పష్టం చేశారు. గతంలో తనకు సహకరించిన పలువురు నేతలు మోసం చేశారని ఆరోపిస్తూ, ఎవరికీ భయపడేది లేదని అన్నారు. ఇప్పటికే రేడియల్ రోడ్ల టెండర్ల వ్యవహారంలో తన కుటుంబానికి చెందిన కంపెనీని ప్రభుత్వం పక్కన పెట్టిందంటూ రాజగోపాల్‌రెడ్డి న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజా వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో మరోసారి చర్చకు దారితీశాయి. నిధుల కేటాయింపుపై ఇటీవల జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందించిన నేపథ్యంలో, రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తిపై పార్టీ నాయకత్వం ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

# మురసు తుపాను ప్రభావంతో తెలంగాణలో వర్షాలు

### 4 రోజుల పాటు భారీ వర్ష సూచన

### పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లు

హైదరాబాద్, నవంబర్ 2:లి బంగాళాఖాతంలో ఏర్పడిన మురసు తుపాను ప్రభావంతో తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సోమవారం నుంచి గురువారం వరకు పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, మంగళవారం కొన్ని జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని తెలిపింది. ఈ మేరకు జిల్లాల వారీగా రెడ్, ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌లు జారీ చేసింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. మురసు తుపాను మంగళవారం ఉదయం నెల్లూరు--నరసాపురం మధ్య ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటిన అనంతరం తెలంగాణ వైపు కదులుతూ క్రమంగా బలహీనపడే అవకాశం ఉంది. తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్ష తీవ్రత పెరుగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ ఎస్. స్టెల్లా వెల్లడించారు.

#### మంగళవారం మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్

సోమవారం ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మంగళవారం ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఈ జిల్లాల్లో 20 సెంటీమీటర్లకు పైగా అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు.

#### బుధవారం పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

బుధవారం ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాగులు, వంకలు, చెరువులు, కాలువల సమీపానికి వెళ్లవద్దని హెచ్చరించారు. వాతావరణ శాఖ తాజా సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### 22 కి.మీ. వేగంతో దూసుకొస్తున్న

# మురసు తుపాను

### ఏపీ, తెలంగాణకు భారీ వర్ష సూచన..

### తీరం దాటే వేళ 120 కి.మీ. వేగంతో గాలులు

విశాఖపట్నం, నవంబర్ 2: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను 'మురసు' వేగంగా ఆంధ్రప్రదేశ్ తీరంవైపు దూసుకొస్తోంది. గత ఆరు గంటల్లో గంటకు 22 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ వాయవ్య దిశగా కదిలినట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. సోమవారం ఉదయం 8.30 గంటల సమయానికి నెల్లూరుకు ఆగ్నేయంగా 160 కి.మీ., చెన్నైకి ఈశాన్యంగా 180 కి.మీ., కావలికి ఆగ్నేయంగా 180 కి.మీ., ఒంగోలుకు ఆగ్నేయంగా 210 కి.మీ. దూరంలో తుపాను కేంద్రీకృతమై ఉంది. నవంబర్ 2 అర్ధరాత్రి నుంచి 3వ తేదీ తెల్లవారుజాము మధ్య నెల్లూరు-నరసాపురం మధ్య, ఒంగోలు సమీపంలో దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

#### పలు జిల్లాలకు భారీ వర్ష సూచన

తుపాను ప్రభావంతో నవంబర్ 2, 3 తేదీల్లో కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు తదితర జిల్లాలతో పాటు పలు ప్రాంతాల్లో వర్ష ప్రభావం ఉండనుంది. తెలంగాణలోనూ నవంబర్ 3న కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

#### సహాయక బృందాలు సిద్ధం

తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. అత్యవసర సహాయక చర్యల కోసం ఆరు ఎన్డీఆర్ఎఫ్, ఏడు ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. తీర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కృష్ణపట్నం పోర్టులో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. విద్యుత్, తాగునీరు, వైద్య సేవలకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారిక సూచనలు పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ఓట్ చోరీ జరిగితే రాహుల్, రేవంత్ ఎలా గెలిచారు?

### కాంగ్రెస్ ఆరోపణలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ప్రశ్నలు



హైదరాబాద్, నవంబర్ 2: ఓట్ చోరీ ఆరోపణలపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగితే రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎలా గెలిచారని ప్రశ్నించారు. ఎస్ఐఆర్ వల్ల బీజేపీకి ప్రయోజనం కలుగుతోందన్న ఆరోపణలు నిజమైతే కేరళలో కాంగ్రెస్ ఎలా విజయం సాధించిందని నిలదీశారు. కాంగ్రెస్ అబద్ధాలకు కేరాఫ్‌గా మారిందని విమర్శించారు. కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పేందుకే కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్‌కు వచ్చారని రాంచందర్‌రావు తెలిపారు. రాజ్యాంగబద్ధ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసేలా మాట్లాడటం ప్రమాదకరమని, ప్రజల్లో ఆ సంస్థలపై నమ్మకం తగ్గితే దేశంలో అరాచక పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. అమిత్ షా పాల్గొనే పాదయాత్రకు లక్ష మందికి పైగా హాజరయ్యే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఓట్ చోరీ, ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు హైదరాబాద్ వేదికగా అమిత్ షా సమాధానం చెబుతారని పేర్కొన్నారు.



### 27వ అఖిల భారత పోలీస్ బ్యాండ్ పోటీలకు శ్రీకారం

### కర్టెన్ రైజర్ కార్యక్రమానికి హాజరైన సీపీ బి. సుమతి.. ముఖ్య అతిథిగా ఎం.ఎం. కీరవాణి

రంగారెడ్డి: సీఆర్‌పీఎఫ్ సదరన్ సెక్టార్ ఆధ్వర్యంలో రంగారెడ్డి సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో నిర్వహించనున్న 27వ అఖిల భారత పోలీస్ బ్యాండ్ పోటీల కర్టెన్ రైజర్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ హాజరయ్యారు. ఆస్కార్ అవార్డు గ్రహీత, పద్మశ్రీ పురస్కార గ్రహీత సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీల లోగో, మస్కట్‌ను ఆవిష్కరించడంతో పాటు టీజర్, కార్యక్రమాల షెడ్యూల్‌ను విడుదల చేశారు.

### నవంబర్ 11 నుంచి కేటీఆర్ బస్సు యాత్ర..

### 29న భారీ బహిరంగ సభ



హైదరాబాద్, నవంబర్ 2 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బస్సుయాత్రకు సిద్ధమవుతున్నారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. నవంబర్ 11 నుంచి 14వ తేదీ మధ్య రెండు రోజుల పాటు కేటీఆర్ బస్సు యాత్ర చేపడతారని తెలిపారు. మేడిగడ్డ నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర, గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల మీదుగా సాగుతుందని వివరించారు. ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని పరిశీలిస్తూ, రైతుల ఇబ్బందులను ఆధారాలతో ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు.మరోవైపు, తెలంగాణ ఉద్యమంలో చారిత్రక ఘట్టమైన దీక్షా దివస్‌ను పురస్కరించుకుని నవంబర్ 29న భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు గంగుల తెలిపారు. 2009లో కేసీఆర్‌ను అరెస్టు చేసిన అలుగునూరు లేదా నుస్తులాపూర్ ప్రాంతంలో ఈ సభను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ సభకు సుమారు 50 వేల మంది ప్రజలను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.



# సీఎం రేవంత్ రెడ్డికి వైఎస్ షర్మిల వివాహ ఆహ్వానం

### కుమార్తె అంజలి రెడ్డి రిసెప్షన్‌కు రావాలని ఆహ్వానం

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుమార్తె అంజలి రెడ్డి వివాహ రిసెప్షన్‌కు హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. డిసెంబర్ 5న అంజలి రెడ్డి, రఘురామ్ రెడ్డి వివాహ రిసెప్షన్ జరగనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వేడుకకు ఆహ్వానించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరు పట్టభద్రుల ఓటరు నమోదు చేసుకోవాలి

## - ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు , ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



కుత్బుల్లాపూర్ నవంబర్ 2(వాయిస్ టుడే): శేరిలింగంపల్లి నియోజకవర్గానికి సంబంధించి పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంపై బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత నాయకులతో చందానగర్ మరియు మక్తా-మియాపూర్ డివిజన్ల ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కూకట్పల్లి నియోజకవర్గ శాసన సభ్యులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు , మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై నాయకులతో చర్చించి, అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. గత పట్ట భద్రుల ఓట్ల జాబితా ఆధారంగా పూర్తి వివరాలు సేకరించి అర్హులైన ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నవంబర్ 6 చివరి తేదీ కావడంతో ఓటర్ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం నాయకులు అభిమానులు కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.మన ఇళ్లలోని పట్టభద్రులతోపాటు కాలనీ, డివిజన్ తో పాటు పరిచయం ఉన్న ప్రతి ఒక్కరి ఇళ్లలో పట్టభద్రులను గుర్తించి ఓటర్ నమోదు చేపించాలి.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియ మొదట మన ఇంటి నుంచి ప్రారంభమవ్వాలి.గతంలో ఓట్లు వేసిన పట్టభద్రులు కూడా తిరిగి ఓటర్ నమోదును చేపించుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలి.రాష్ట్రంలో కెసిఆర్ నాయకత్వాన్ని తిరిగి 70 శాతం మంది ప్రజలు కోరుకుంటున్నారని, ఎన్నికలెప్పుడు వస్తాయి, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి ఎప్పుడూ చేస్తామని ప్రజలు ఎదురుచూస్తున్నారు.కానీ నేడు ప్రభుత్వ వైఫల్యాలు, పాలనలో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, యువతను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్న తీరును ప్రజలకు వివరించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయానికి కృషిచేయాలన్నారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపులో మంచి మెజారిటీ సాధించేలా నాయకులు, కార్యకర్తలకు కృషి చేయాలి.ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత నాయకులు పాల్గొన్నారు.



## మీ వెంటే ఉంటా...!
## బాలయ్య నగర్ ను మరింత అభివృద్ధి చేస్తా!!

**బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**

**ప్రజా బంధువుకు "బాలయ్య నగర్" బస్తీ వాసుల ఘన స్వాగతం...!**

**జై బిఆర్ఎస్...జైజై వివేకన్న నినాదాలతో మార్మోగిన బాలయ్య నగర్**

కుత్బుల్లాపూర్ నవంబర్ 2(వాయిస్ టుడే): మౌలిక వసతుల కల్పననే లక్ష్యంగా 125 - గాజుల రామారం డివిజన్ బాలయ్య నగర్ లో దాదాపు 47.50 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... నిరుపేదలు అధికంగా నివసించే బాలయ్య నగర్ బస్తీ నిలబెట్టేందుకు బస్తీ వ్యవస్థాపకులు ఎల్లయ్య చేసిన త్యాగం మరువలేనిదని, బాలయ్య నగర్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా గత పన్నండేళ్ళ కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి భూగర్భ డ్రైనేజీ, సిసి రోడ్లు, వీధి దీపాలను ఏర్పాటు చేయడం జరిగిందని, రానున్న రోజుల్లో కూడా మౌలిక వసతుల కల్పనతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణము, బతుకమ్మ ఘాట్, ఛత్ పూజ గాట్లను నిర్మించేందుకు మరింత కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బాలయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఈ.నాగేష్ ఉపాధ్యక్షులు సిఎస్ఐ, ప్రధాన కార్యదర్శి ఈ.పార్వతి శ్యాంసుందర్, గంగయ్య, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, నవాబ్ భాయ్, ఇబ్రహీం ఖాన్, నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిని నిర్వహించాలని సిపిఐ మరియు జనసేన నాయకులు ధర్నా



కుత్బుల్లాపూర్ నవంబర్ 2(వాయిస్ టుడే): ప్రతి సోమవారం నాడు కలెక్టరేట్ కార్యాలయంలో జరిగే ప్రజావాణికి దూరప్రాంతాల నుండి ప్రజలు వెళ్లవలసి రావడం వల్ల వారికి ఇబ్బంది కలగకుండా స్థానిక రెవెన్యూ అధికారి కార్యాలయంలోని ప్రజావాణి నిర్వహించాలని గత మూడు నెలల క్రితం జీవో జారీ చేసినప్పటికీ కు రెవెన్యూ కార్యాలయంలో అధికారికంగా ప్రజావాణి నిర్వహించకపోవడం వల్ల నేడు సిపిఐ మరియు జనసేన పార్టీలో ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. గత వారం మరియు గత నెల క్రితం కూడా ప్రజావాణి నిర్వహించాలని వినితిపత్రం ఇచ్చినప్పటికీ స్పందించకపోవడం వల్లే నేడు ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించాల్సి వచ్చిందని, ప్రజావాణి ఉండడం వల్ల ప్రజల తమ సమస్యలను నేరుగా అధికారులను కలిసి ఇచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి ఎంతో కొంత ఆ సమస్య పరిష్కారం అవుతుందని ఆశతో ప్రజలు ఉంటారని కానీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ప్రజావాణి కార్యక్రమం అనుకున్నంత మేరకు విజయం సాధించలేకపోతుందని దానికి ప్రధాన కారణం అధికారుల నిర్లక్ష్యమేనని సిపిఐ జిల్లా కార్యదర్శి అన్నారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూముల పైన హైకోర్టు తీర్పునిచ్చి నెలలు గడిచినప్పటికీ నేటికీ చర్యలు తీసుకోకపోవడం అదేవిధంగా జగద్గిరిగుట్ట మరియు గాజులరామారంలో అనేక భూకబ్జాలను కొనసాగుతున్నాయని వాటన్నిటిని పరిష్కరించాల్సిందిగా డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్వో బైరెడ్డి రాజేష్ వినతి పత్రం ఇచ్చి కచ్చితంగా ప్రజావాణి నిర్వహించాలని డిమాండ్ చేయగా వారు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ జనసేన అధికార ప్రతినిధి నల్లగిరి సతీష్ సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం మండల కార్యదర్శి కే స్వామి సహాయ కార్యదర్శి హరినాథ్ రావు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మీ శ్రీనివాస్ సిపిఐ నాయకులు కే వెంకటేష్ సదానంద, సహదేవరెడ్డి శ్రీనివాస్ చారి, మల్లేష్, ఇమామ్ యువజన సంఘం నాయకులు కీర్తి ,ప్రవీణ్, నరసింహ, జనసేన నాయకులు దుర్గాప్రసాద్,నవీన్,మహేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



## పాశమైలారం TGIIC హరితహారం పార్క్ భూమిని పరిరక్షించాలి
### ప్రజావాణిలో ఫిర్యాదు

పఠాన్ చేరు (వాయిస్ టుడే): పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలోని 10 ఎకరాల TGIIC హరితహారం పార్క్ భూమిని పరిరక్షించాలని కోరుతూ ఇస్నాపూర్ మున్సిపాలిటీ కో-ఆప్షన్ మెంబర్ మొహమ్మద్ నిజాముద్దీన్ బాబా జిల్లా స్థాయి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 2015లో తెలంగాణ హరితహారం కార్యక్రమం ప్రారంభమైన సమయంలో పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలో 10 ఎకరాల భూమిని పార్క్ కోసం కేటాయించారు. ఈ ప్రదేశంలో అప్పటి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు మొక్క నాటి హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ప్రస్తుతం పార్క్ భూమిలో కొంత భాగం ఆక్రమణకు గురైనట్లు, అలాగే పార్క్ భూమి మీదుగా రహదారి నిర్మాణం జరిగినట్లు పేర్కొంటూ, దీనిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని నిజాముద్దీన్ బాబా కోరారు. పార్క్ భూమికి సంబంధించిన సర్వే నంబర్లు, విస్తీర్ణం, హద్దులు, TGIIC ఆమోదించిన లేఅవుట్ తదితర రికార్డులను పరిశీలించి, రెవెన్యూ మరియు TGIIC అధికారులతో సంయుక్త సర్వే నిర్వహించాలని ప్రజావాణి ద్వారా కోరారు. అనధికార ఆక్రమణ లేదా రహదారి నిర్మాణం ఉన్నట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని, పార్క్ భూమిని ప్రజా ప్రయోజనం కోసం పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఆక్రమణలకు అవకాశం లేకుండా పార్క్ భూమికి స్పష్టమైన హద్దులు, సర్వే రాళ్లు మరియు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

## ఆర్థిక పరిజ్ఞానంపై యాజమాన్య వికాస కార్యక్రమం
### గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఈనెల 19-20 తేదీలలో నిర్వహణ
### ఆసక్తి ఉన్నవారికి అద్భుత అవకాశం



పఠాన్ చేరు (వాయిస్ టుడే): వ్యూహాత్మక వ్యాపార నిర్ణయాలు తీసుకోవడానికి అవసరమైన ఆర్థిక పరిజ్ఞానం, ఆచరణాత్మక నైపుణ్యాలతో మేనేజర్లను సన్నద్ధం చేయడం లక్ష్యంగా ఈనెల 19-20 తేదీలలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ లోని అకౌంటింగ్, ఫైనాన్స్ విభాగం రెండు రోజుల యాజమాన్య వికాస కార్యక్రమం (ఎండీపీ) నిర్వహించనుంది. 'సంఖ్యల నుంచి వ్యూహం వరకు: నిర్వాహక నైపుణ్యం కోసం ఆర్థిక పరిజ్ఞానం' అనే పేరుతో, హైబ్రిడ్ పద్ధతిలో ఆచరణాత్మక కార్యశాలగా దీనిని ఏర్పాటు చేస్తున్నట్లు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ కార్యక్రమం ప్రధానంగా ఫైనాన్స్ లో అధికారిక నేపథ్యం లేని మేనేజర్లు, వృత్తి నిపుణుల కోసం రూపొందించామని, ఇది వారికి ఆర్థిక, వాణిజ్యపరమైన అవగాహనను పెంపొందించుకోవడానికి తోడ్పడుతుందన్నారు. ఇది ఆర్థిక విశ్లేషణ, వ్యయ నిర్మాణాలు, బడ్జెట్ రూపకల్పన, మూలధన కేటాయింపు, పెట్టుబడిపై రాబడి, పెట్టుబడి మూల్యాంకనం వంటి కీలక అంశాలపై దృష్టి సారిస్తుందని తెలిపారు. ఇందులో పాల్గొనేవారు ఆర్థిక విలువ జోడింపు (ఈవీఏ), మూలధన సగటు వ్యయం (డబ్ల్యుఏసీసీ), మూలధన ఆస్తి ధరల నమూనా (సీఏపీఎం), ఆర్థిక అంచనా వంటి ఆధునిక క్యాపిటల్-బడ్జెట్ పద్ధతులు, వ్యూహాత్మక ఆర్థిక సాధనాలపై ఆచరణాత్మక అంతర్దృష్టులను కూడా పొందుతారని వివరించారు.

ఈ అభ్యాస ప్రయాణం ఐదు పరస్పర సంబంధిత దశలను అనుసరిస్తుందని, అవి- అర్థం చేసుకోవడం, విశ్లేషించడం, పరిష్కరించడం, నమూనాను రూపొందించడం, ప్రదర్శించడంగా పేర్కొన్నారు. వాస్తవ ప్రపంచ వ్యాపార సందర్భాలు, ప్రత్యక్ష అభ్యాసాలు, ఆచరణాత్మక కేస్ అప్లికేషన్ల ద్వారా, పాల్గొనేవారు కీలక ఆర్థిక చోదకాలను గుర్తించడం, వ్యాపార పనితీరును విశ్లేషించడం, ఆచరణీయమైన ఆర్థిక అంతర్దృష్టులను రూపొందించడం, పెట్టుబడి అవకాశాలను మూల్యాంకనం చేయడం, వ్యూహాత్మక సిఫార్సులను సమర్థవంతంగా తెలియజేయడం నేర్చుకుంటారని వివరించారు.

ఈ కార్యక్రమం ఆర్థిక భావనలకు, నిర్వహణ పద్ధతులకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చి, తరగతి గదిలో నేర్చుకునే విషయాలను ఆచరణాత్మక వ్యాపార పరిష్కారాలుగా మార్చుకునే అవకాశాన్ని పాల్గొనేవారికి అందిస్తుందని తెలిపారు. ఇది వృత్తిపరమైన సామర్థ్యాలను మెరుగుపరచుకోవడానికి, నిర్ణయం తీసుకునే సామర్థ్యాలను బలోపేతం చేయడానికి విలువైన అంతర్దృష్టులను కూడా అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ లోని అకౌంటింగ్, ఫైనాన్స్ విభాగం నుంచి డాక్టర్ సుశోభన్ పాల్, డాక్టర్ మెరుగు వేణుగోపాల్ నిర్వహిస్తారని, పాల్గొనేవారందరికీ సంబంధిత అభ్యాస సామగ్రితో పాటు ధ్రువీకరణ పత్రం (సర్టిఫికెట్) అందజేస్తామని తెలిపారు. ఇందులో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు, తమ పేర్ల నమోదు, రుసుము తదితర వివరాల కోసం 84209 66501ను సంప్రదించాలి, లేదా cbe@gitam.eduకు ఈ-మెయిల్ చేయాలని సూచించారు.



## తాగి న్యూసెన్స్ చేస్తు హంగామా.!
### 5 మంది వ్యక్తులపై కేసు నమోదు

మేడిపల్లి, వాయిస్ టుడే న్యూస్, నవంబర్ 2 : మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చెంగిచెర్ల ఎక్స్ రోడ్డు వద్ద గల శ్రీనివాస వైన్స్ దగ్గర 31.10.2026 నాడు రాత్రి సమయంలో తాగి రోడ్డుపై న్యూసెన్స్ చేయడంతో అట్టి వ్యక్తులపై ఫిట్ కేస్ కేసు నమోదు చేయడం జరిగింది. మేడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 1) డి. అంబదాస్, తండ్రి పేరు: చంద్రయ్య, వయస్సు 38 సంవత్సరాలు, వృత్తి: ఫోటోగ్రాఫర్, నివాసం, శ్రీ సాయి రెసిడెన్సీ కాలనీ, రోడ్ నెం. 06, చెంగిచెర్ల. 2) బి. శ్రీకాంత్, తండ్రి పేరు: యాదయ్య, వయస్సు 29 సంవత్సరాలు, వృత్తి: మార్కెటింగ్, నివాసం: రోడ్ నెం. 03, శ్రీ సాయి రెసిడెన్సీ కాలనీ, చెంగిచెర్ల. 3) మేకల మహేష్, తండ్రి పేరు: లక్ష్మయ్య, వయస్సు 30 సంవత్సరాలు, వృత్తి: డ్రైవర్, నివాసం: దత్తాత్రేయ నగర్, చెంగిచెర్ల. 4) కె. లక్ష్మణ్, తండ్రి పేరు: శంకర్, వయస్సు 34 సంవత్సరాలు, వృత్తి: మిర్చి బండి వ్యాపారం, నివాసం: ఇంటి నెం. 14-44/1, కమల నగర్ కాలనీ, మెడిపల్లి. 5) ఎం. చిరంజీవి, తండ్రి పేరు: సంతోష్, వయస్సు 42 సంవత్సరాలు, వృత్తి: పాన్ షాప్ వ్యాపారం, నివాసం: ఇంటి నెం. 3-100, శివ గణేష్ నగర్ కాలనీ, చెంగిచెర్ల, పైన తెలిపిన వ్యక్తులపై కేసు నమోదు చేసి కోర్టు ముందు హాజరు పరచడం జరిగిందని శాంతి భద్రతల విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే ఉపేక్షించేది లేదని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మేడిపల్లి సిఐ డి. జలంధర్ రెడ్డి తెలిపారు.

## హైదరాబాద్‌లో అమిత్ షా మహా పాదయాత్రకు గుర్రంపై తరలివెళ్లిన బీజేపీ నాయకుడు కేశబోయిన శ్రీధర్!



కేంద్ర హోంశాఖ మంత్రి శ్రీ అమిత్ షా హైదరాబాద్‌లో చేపట్టిన మహా పాదయాత్రకు బీజేపీ శ్రేణులు ఉత్సాహంగా తరలివెళ్లాయి. ఈ సందర్భంగా హిమాయత్‌నగర్‌కు చెందిన బీజేపీ నాయకుడు కేశబోయిన శ్రీధర్ గుర్రంపై స్వారీ చేస్తూ సభకు బయలుదేరడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో హిమాయత్‌నగర్ బీజేపీ డివిజన్ అధ్యక్షురాలు మాధవి, అభిషేక్ యాదవ్, అర్జున్ సింగ్, కేశబోయిన కవిత, తుల్జా రామ్, అనిల్, కార్తిక్, శ్రీశైలం, రమేష్ భాయ్, ప్రకాష్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో అమిత్ షా మహా పాదయాత్రకు బీజేపీ నాయకులు, ఓబీసీ నేతల భారీ తరలింపు
### ఉత్సాహంగా పాల్గొన్న జెకె శేఖర్ యాదవ్




కుత్బుల్లాపూర్ నవంబర్ 2(వాయిస్ టుడే): హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మహా పాదయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్న.. జెకె శేఖర్ యాదవ్ -- మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు.. సిద్ధిరాం రెడ్డి - బీజేపీ సీనియర్ నాయకుడు.. గండి రాజు యాదవ్ -మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి... బీజేపీ నాయకులు జగన్ ముదిరాజ్ -- కె. బిక్షపతి . కృష్ణ యాదవ్, కుమార్ యాదవ్ తదితర నాయకులు. మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ నాయకులు, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## బషీర్‌బాగ్‌లో అమిత్ షా పాదయాత్రకు భారీగా తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు
### హెచ్ఎంటీ నగర్ డివిజన్ నుంచి పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో భారీగా హాజరు

నాచారం (వాయిస్ టుడే): బషీర్‌బాగ్ చౌరస్తాలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేపట్టిన పాదయాత్రకు మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో హెచ్ఎంటీ నగర్ డివిజన్ నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అమిత్ షా ప్రసంగిస్తూ.. ఎస్ఐఆర్, ఈవీఎంలపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నాయకులు, తాము కోరుకున్న బ్యాలెట్ విధానంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు తమ వైఖరిని మార్చుకోవాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చంద్రమౌళి, కార్మిక విభాగం జిల్లా కన్వీనర్ యోగేశ్వర్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, హన్మంత్ బిరాదర్, గందమల గోపి, రాజిరెడ్డి, సురేందర్ స్వామి, శేఖర్ గుప్తా, వేణుగోపాల్, పోతగాని విజయ గోపాల్ గౌడ్, మంజులవాణి, పార్వతి తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వాయిస్ VOICE OF PRAJALU ప్రజల గొంతుక - నిజం కోసం.. ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
మంగళవారం 3 నవంబరు 2026



## జిహెచ్ఎంసి పారిశుద్ధ్య కార్మికులకు స్వామివారి ప్రసాదం పంపిణీ

నాచారం (వాయిస్ టుడే): కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని నాచారంలో ఘనంగా అక్టోబర్ 29, 30,31 తేదీల్లో శ్రీనివాస సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నాచారం సవకార్ నగర్ కాలనీలో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు శ్రీవారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్మికులు భక్తిశ్రద్ధలతో ప్రసాదాన్ని స్వీకరించారు.




## పటాన్చెరు పారిశుధ్య నిర్వహణలో మరో ముందడుగు

### ప్రజారోగ్యానికి పెద్దపీట: మాద్రి పృథ్వీరాజ్

పఠాన్ చేరు (వాయిస్ టుడే): పటాన్చెరు, అమీన్‌పూర్ పరిధిలో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్టం చేసేందుకు రూ.12 కోట్లతో 10 స్వీపింగ్ మిషన్లు, 10 టిప్పర్ల కొనుగోలు చేయడం అభినందనీయం. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చొరవతో, తోషిబా పరిశ్రమ అందించిన జూ= నిధులతో ఆధునిక పారిశుధ్య వాహనాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా కీలక అడుగు పడింది. పటాన్చెరు మైత్రి మైదానంలో నిర్వహించిన వాహనాల ప్రారంభోత్సవ కార్యక్రమం పట్టణ పరిశుభ్రతకు మరింత ఊతమివ్వనుంది. పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న కాలనీలకు అనుగుణంగా ప్రతి డివిజన్‌లో అవసరమైన పారిశుధ్య వాహనాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచడం ఎంతో అవసరం. పరిశుభ్రమైన పరిసరాలు.. ఆరోగ్యవంతమైన సమాజం.. అభివృద్ధి చెందిన పటాన్చెరు! పారిశుధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం కూడా కీలకం. ప్రతి ఒక్కరూ చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా, పారిశుధ్య సిబ్బందికి సహకరిస్తూ మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం. ఈ కార్యక్రమంలో పటాన్చెరువు మాజీ కార్పొరేటర్ కుమార్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, తోషిబా డైరెక్టర్, మేనేజర్, రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ అంజయ్య, భారత్ నగర్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి , అమీన్పూర్ జిహెచ్ఎంసి, పటాన్చెరు డిప్యూటీ కమిషనర్లు, ఏఈ, వివిధ స్థాయి అధికారులు, టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## నూతన అంబర్‌పేట ఎస్‌హెచ్‌ఓ కొత్తపల్లి ముత్తుకు బీఆర్ఎస్ మైనారిటీ నాయకుల శుభాకాంక్షలు

అంబర్ పేట, నవంబర్ 02;( వాయిస్ టూడే): అంబర్‌పేట పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా బాధ్యతలు స్వీకరించిన కొత్తపల్లి ముత్తును అంబర్‌పేట బీఆర్ఎస్ మైనారిటీ విభాగం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ కొత్తపల్లి ముత్తు నాయకులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ప్రతి ఒక్కరినీ వ్యక్తిగతంగా పలకరిస్తూ వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీస్ శాఖకు సహకరిస్తూ ప్రజలకు, పోలీసులకు మధ్య సమన్వయాన్ని పెంపొందించాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ మైనారిటీ విభాగం నాయకులు మాట్లాడుతూ అంబర్‌పేట నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక సామరస్యం కోసం పోలీస్ శాఖకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో జీవించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సయ్యద్ అఫ్రోజ్ పటేల్, జనరల్ సెక్రటరీ మహమ్మద్ జాఫర్, సీనియర్ నాయకులు షేక్ రఫీక్ అహ్మద్, షేక్ షానూర్, సయ్యద్ యూసుఫ్ బాబా, మీర్జా ఆదిల్ బేగ్, యువజన నాయకుడు మహమ్మద్ అజర్, మహమ్మద్ జమీల్ (యాబా) తదితరులు పాల్గొన్నారు.

# పటాన్చెరు పారిశుధ్యంలో నవశకం

**ఎమ్మెల్యే జిఎంఆర్ చొరవతో 12 కోట్ల రూపాయలతో 10 స్వీపింగ్ మిషన్లు, 10 టిప్పర్లు**

**తోషిబా సిఎస్ఆర్ నిధులతో కొనుగోలు**

**ప్రతి వార్డు పరిశుభ్రతకు చిరునామాగా నిలవాలి..**

**ప్రతి డివిజన్ కి స్వీపింగ్ మిషన్, టిప్పర్, జెసిబి.. ఎమ్మెల్యే జిఎంఆర్..**

**పటాన్చెరు మైత్రి మైదానం వేదికగా వాహనాల ప్రారంభం..**

**పెరుగుతున్న కాలనీలకు అనుగుణంగా పారిశుధ్య సిబ్బందిని పెంచాలి..**

**ప్రభుత్వానికి ఎమ్మెల్యే జిఎంఆర్ సూచన**



పఠాన్ చేరు (వాయిస్ టుడే): అనునిత్యం. అనుక్షణం పటాన్చెరు నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పారిశుధ్య నిర్వహణను పటిష్టం చేయడంలో భాగంగా సరికొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. సైబరాబాద్ మున్సిపల్ పరిధిలోని పటాన్చెరు, అమీన్పూర్ సర్కిళ్ల పరిధిలో పెరుగుతున్న జనాభాకు, కాలనీలకు అనుగుణంగా పారిశుధ్య అవసరాల కోసం తోషిబా పరిశ్రమ సహకారంతో 12 కోట్ల రూపాయలతో పారిశుధ్య వాహనాలు కొనుగోలు చేసి అందించారు.

సోమవారం ఉదయం పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. ఎమ్మెల్యే జిఎంఆర్, తోషిబా పరిశ్రమ హెచ్ఆర్ డైరెక్టర్ మారు మోటో చేతుల మీదుగా తొలి విడతలో కొనుగోలు చేసిన 5 టిప్పర్లు, 5 స్వీపింగ్ మెషిన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో 2014 నుండి 2023 వరకు పటాన్చెరు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల మూలంగా రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందడంతో పాటు వందల సంఖ్యలో నూతన కాలనీలు ఏర్పడ్డాయని తెలిపారు. ఇందుకు అనుగుణంగా సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పటాన్చెరు, అమీన్పూర్ సర్కిల్స్ పరిధిలోగల తొమ్మిది డివిజన్లలో గల ప్రజలకు పారిశుధ్య అంశంలో మెరుగైన సేవలు అందించడంలో భాగంగా నూతన వాహనాల కొనుగోలుకు శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో పటాన్చెరు పరిధిలోని తోషిబా పరిశ్రమ అందించిన 12 కోట్ల రూపాయల సిఎస్ఆర్ నిధులతో 10 స్వీపింగ్ మెషీన్లు, పది టిప్పర్లు కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ఆధునిక టెక్నాలజీ వీటిలో పొందుపరచడం జరిగిందని పేర్కొన్నారు. మొదటి విడతలో కొనుగోలు చేసిన వాటిలో అమీన్పూర్ సర్కిల్ కు 3 స్వీపింగ్ మిషన్లు, మూడు టిప్పర్లు, పటాన్చెరు సర్కిల్ కు 2 స్వీపింగ్ మిషన్లు, 2 టిప్పర్లు అందించడం జరిగిందని తెలిపారు. బిహెచ్ఎల్ చౌరస్తా నుండి ఇస్నాపూర్ చౌరస్తా వరకు గల జాతీయ రహదారి పరిశుభ్రత కోసం ప్రత్యేకంగా మరో స్లీపింగ్ మిషన్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి కాలనీ పారిశుద్ధ అంశంలో ప్రగతి సాధించాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత ఆవశ్యకమని తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వెయ్యకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెత్త వాహనాలకు అందించాలని విజ్ఞప్తి చేశారు. పారిశుధ్య వాహనాలు కొనుగోలు కోసం 12 కోట్ల రూపాయలు అందించిన తోషిబా పరిశ్రమ యాజమాన్యానికి నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటారని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. భవిష్యత్తులో నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.

**పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా**

**పారిశుధ్య సిబ్బందిని నియమించండి..**

9 డివిజన్ల పరిధిలో పెరుగుతున్న కాలనీలకు అనుగుణంగా సరిపడా పారిశుద్ధ్య సిబ్బంది లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. చనిపోయిన కార్మికుల స్థానంలో నూతన సిబ్బంది నియామకాలు చేపట్టకపోవడం మూలంగా ఈ పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ప్రతిరోజు చెట్ల సేకరించకపోవడం మూలంగా ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి డివిజన్ పరిధిలో నూతన పారిశుద్ధ సిబ్బందిని తక్షణమే నియమించాలని కోరారు. పారిశుద్ధ్య వాహనాలతో పాటు జెసిబిలు సైతం అందిస్తున్నామని తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధిలో తమను భాగస్వాములను చేసినందుకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని తోషిబా పరిశ్రమ ఎండి మారు మోటో తెలిపారు. అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

**ఎమ్మెల్యే జిఎంఆర్ చొరవ ప్రశంసనీయం..**

సీఎంసీ పరిధిలోని తొమ్మిది డివిజన్లలో పారిశుధ్య నిర్వహణ కోసం సి ఎస్ ఆర్ నిధులతో వాహనాలు కొనుగోలు చేసి అందించడంలో ఎమ్మెల్యే జిఎంఆర్ చొరవ ప్రశంసనీయమని శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కావ్య, అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లలిత శ్రావణి, తోషిబా పరిశ్రమ జనరల్ మేనేజర్ రామకృష్ణ, సీనియర్ మేనేజర్ రాజా, మాజీ కార్పొరేటర్లు అంజయ్య, కుమార్ యాదవ్, సింధు రెడ్డి, అమీన్పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్పూర్ మాజీ డిసి ప్రదీప్ కుమార్, బల్దియా అధికారులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పటాన్‌చెరు పట్టణ పరిధిలో నిర్వహించిన పలు శుభకార్యక్రమాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు

### MDR ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు

పఠాన్ చేరు (వాయిస్ టుడే): గౌతమ్ నగర్‌కు చెందిన కుమార్ చారి కుమార్తె హాఫ్ సారీ వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం సిటిజన్ కాలనీలో ప్రభాకర్ నూతన గృహప్రవేశ వేడుకకు హాజరై, నూతన గృహం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అలాగే, సీతారామయ్య వెంచర్‌లో ప్రేమ కుమార్తి మొదటి పుట్టినరోజు వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## రైతును ఆదుకునేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు భారత్ కిసాన్ సంఘటన్ విజ్ఞప్తి



హైదరాబాద్, నవంబర్ 02: ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం, సాగునీటి కొరత ఏర్పడే ముప్పు ఉన్నందున రైతాంగాన్ని ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని భారత్ కిసాన్ సంఘటన్ ఏపీ కో-కన్వీనర్ దారా రవికుమార్ విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు అండగా నిలిచి, విత్తనాలు-ఎరువుల పంపిణీ నుంచి దిగుబడుల విక్రయం వరకు పూర్తి భరోసా కల్పించాలని కోరారు. వర్షపాత లభ్యతను బట్టి ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, సూక్ష్మ సేద్యం, నీటి సంరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే పంటల బీమా పరిహారాన్ని సకాలంలో అందిస్తూ, గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీల జీవనోపాధి దెబ్బతినకుండా ఆర్థిక సహాయం, పశుసంవర్ధక రంగానికి మద్దతు మరియు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు చూపాలని పేర్కొన్నారు. 'రైతే రాజు' అనే నినాదం మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపాలని, దేశ ఆహార భద్రతను కాపాడే రైతును ఆదుకోవడమే ప్రభుత్వాల ప్రథమ ప్రాధాన్యం కావాలని ఆయన స్పష్టం చేశారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు బీజేపీ మహా పాదయాత్ర

## అమిత్ షా ప్రారంభం.. కూకట్‌పల్లి నుంచి భారీగా పాల్గొన్న బీజేపీ శ్రేణులు



కూకట్‌పల్లి, నవంబర్ 2(వాయిస్ టుడే): ప్రజాస్వామ్య పరిరక్షణ, ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలు, ఎస్.ఐ.ఆర్. ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారాన్ని ఖండిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన మహా పాదయాత్ర విజయవంతంగా ముగిసింది. ఈ మహా పాదయాత్రకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరై, నిజాం కాలేజ్ సమీపంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద పాదయాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి మొజంజాహి మార్కెట్ ఎక్స్ రోడ్ వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగాబీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులతో కలిసి మహా పాదయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాయాత్రలో భాగంగా ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధంగా నిర్వహిస్తున్న విధులు, ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ ఉద్దేశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను బీజేపీ నాయకులు ఖండిస్తూ తమ అభిప్రాయాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం ద్వారా ప్రజల్లో అపోహలు సృష్టించడం సరికాదని పేర్కొన్నారు. ఎస్.ఐ.ఆర్. ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వైఖరిని ప్రశ్నిస్తూ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు బీజేపీ కట్టుబడి ఉందని తెలిపారు. "ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం -- అరాచకవాదాన్ని అంతం చేద్దాం" అనే నినాదంతో సాగిన ఈ మహా పాదయాత్రలో కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటుకున్నాయని ఆయన పేర్కొన్నారు. అలాగే పాదయాత్ర విజయవంతానికి సహకరించిన కేంద్ర, రాష్ట్ర నాయకత్వానికి, కూకట్‌పల్లి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు, వివిధ సంఘాల ప్రతినిధులకు, పాల్గొన్న ప్రజలందరికీ వడ్డేపల్లి రాజేశ్వరరావు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా సభలో పాల్గొన్న బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు తెలంగాణలో బీజేపీ ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.






# ధర్మ రక్షణకు దుర్గావాహిని సిద్ధం కావాలి: ప్రగ్యా దీదీ

హైదరాబాద్, నవంబర్ 02: హిందూ ధర్మ పరిరక్షణ మరియు దేశ రక్షణలో మహిళా శక్తి కీలక పాత్ర పోషించాలని విశ్వహిందూ పరిషత్ (ఎన్ఆ) యువ మహిళా విభాగమైన 'దుర్గావాహిని' అఖిల భారత కన్వీనర్ ప్రగ్యా దీదీ పిలుపునిచ్చారు. భాగ్యనగర్ పాతబస్తీలోని గౌలిపుర మిత్ర క్లబ్‌లో నిర్వహించిన హిందూ యువ మహిళల సమ్మేళనానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సభకు దుర్గావాహిని తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ వాణి సక్కుబాయి అధ్యక్షత వహించారు. ఎన్ఆ పూర్వ నాయకుడు దివంగత అశోక్ సింగల్ శత జయంతి సందర్భంగా ఈ శక్తి వందన్, శక్తి సంచలన్ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. సమావేశంలో ప్రగ్యా దీదీ మాట్లాడుతూ... ఝాన్సీ లక్ష్మీబాయి వీరత్వాన్ని, జిజియాబాయి మాతృత్వ సంస్కారాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. దుష్టశిక్షణ చేసిన దుర్గాదేవి స్ఫూర్తితో మహిళలు ధైర్యంతో ముందుకెళ్లాలని అన్నారు. ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాలు, లవ్ జిహాద్, బలవంతపు మతమార్పిడులపై యువతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అక్రమ చొరబాట్లతో సంస్కృతిపై జరిగే దాడులను సంఘటితంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

**శోభాయమానంగా ప్రదర్శనలు:**

సమ్మేళనానికి ముందు యూనిఫామ్ ధరించిన 1,100 మంది దుర్గావాహిని కార్యకర్తలు పాతబస్తీలో భారీ ర్యాలీ (శక్తి సంచలన్) నిర్వహించారు. 'జై శ్రీరామ్' నినాదాలు, కాషాయ జెండాలతో పాత నగరం కోలాహలంగా మారింది. కార్యకర్తలపై స్థానికులు పూలవర్షం కురిపించారు. లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కార్యకర్తలు ప్రదర్శించిన కర్ర సాము, కత్తి యుద్ధం, ముష్టి యుద్ధ విన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎన్ఆ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మళ్ల సత్యం, రాష్ట్ర సహకార్యదర్శి చింతల వెంకన్న, ఉపాధ్యక్షురాలు సునీతా రెడ్డి, ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ పగడాకుల బాలస్వామి, ప్రొఫెసర్ స్వప్న రెడ్డి, డాక్టర్ లలిత తదితరులు పాల్గొన్నారు.



## జనసేన వీరమహిళ విజయలక్ష్మికి డాక్టర్ గడల పరామర్శ

ఖమ్మం: ఇటీవల గుండెపోటుకు గురైన ఖమ్మం పట్టణ జనసేన వీరమహిళ కొప్పుల విజయలక్ష్మిని జనసేన నాయకుడు డాక్టర్ గడల శ్రీనివాసరావు పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విజయలక్ష్మి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రోజువారీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఆమెకు ధైర్యం చెబుతూ, త్వరగా ఆరోగ్యం మెరుగుపడాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.



## యాదవ సంఘం జాతీయ నాయకుడు నాగభూషణానికి డాక్టర్ గడల పరామర్శ

ఖమ్మం:యాదవ సంఘం జాతీయ నాయకుడు శ్రీ కూరాకుల నాగభూషణాన్ని జనసేన నాయకుడు డాక్టర్ గడల శ్రీనివాసరావు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నాగభూషణం సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా జీవితంలో చురుకుగా పాల్గొనాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు డాక్టర్ గడల తెలిపారు.

## అంగన్‌వాడీలకు రూ.18 వేల వేతనం చెల్లించాలి

**ఉద్యోగులుగా గుర్తించి పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలి**

**అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలపై డాక్టర్ గడల శ్రీనివాసరావు సంఘీభావం**



ఖమ్మం: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి పరిష్కరించాలని జనసేన నాయకుడు డాక్టర్ గడల శ్రీనివాసరావు కోరారు. అంగన్‌వాడీ సిబ్బందిని కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన, వారు సమర్పించిన వినతిపత్రాన్ని స్వీకరించారు. నెలకు రూ. 18 వేల వేతనం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ సిబ్బంది కోరినట్లు తెలిపారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని, పెండింగ్ బిల్లులు, టీఏ--డీఏ బకాయిలు చెల్లించాలని వారు విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. అదనపు విధుల భారం తగ్గించడంతో పాటు ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరినట్లు తెలిపారు.

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, సంరక్షణ అందించడంలో అంగన్‌వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని డాక్టర్ గడల అన్నారు. వారి సేవలను గుర్తించి, సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది న్యాయమైన డిమాండ్ల సాధనకు తన వంతు మద్దతు అందిస్తానని హామీ ఇచ్చారు.

## తెలంగాణలో బీజేపీ అధికారం చేపట్టడం తథ్యం: ఠాకూర్ గోపాల్ సింగ్

**అమిత్ షా 'మహా పాదయాత్ర'కు గోషామహల్ నుండి భారీగా తరలివెళ్లిన కార్యకర్తలు**





హైదరాబాద్, నవంబర్ 02: "ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం... అరాచకత్వాన్ని అంతం చేద్దాం" అనే నినాదంతో ఎస్ఐఆర్ (సర్) పై దుష్ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న రాహుల్ గాంధీ, ఇండియా కూటమి నేతల తీరును నిరసిస్తూ కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా చేపట్టిన మహా పాదయాత్రకు విశేష స్పందన లభించింది. సోమవారం మధ్యాహ్నం నిజాం కాలేజ్ మైదానం వద్ద గల బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నుండి ప్రారంభమైన ఈ మహా పాదయాత్ర ముగింపు సభకు గోషామహల్ నియోజకవర్గం నుండి బిజెపి నాయకుడు, 'సత్య సుందర్ హెల్పింగ్ ఫౌండేషన్' చైర్మన్ ఠాకూర్ గోపాల్ సింగ్, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్ సింగ్ రాథోడ్ ల నేతృత్వంలో వందలాది మంది కార్యకర్తలు భారీ ర్యాలీగా తరలివచ్చారు. పార్టీ జెండాలు, జాతీయ జెండాలు, ప్రధాని మోదీ, అమిత్ షాల ప్లకార్డులు చేతబూని "జై శ్రీరామ్", "భారత్ మాతాకీ జై" అంటూ నినాదాలు చేస్తూ ఎంజే మార్కెట్ చౌరస్తా వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఠాకూర్ గోపాల్ సింగ్ మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టి కలిగిన నాయకత్వంలో దేశంలోని అన్ని రాష్ట్రాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి మోదీ, అమిత్ షాలు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి నష్టం కలిగిస్తున్న బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు తిరస్కరించడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బద్రీనాథ్ సింగ్, సందీప్ సింగ్, ఇంద్రపాల్ సింగ్, గణేష్ మోరే, సూరజ్ లతో పాటు 1,200 మందికి పైగా పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదు వేగవంతం చేయాలి

**పాల్వంచలో నమోదు కేంద్రాన్ని సందర్శించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**

**పలువురితో ఫారం-18 దరఖాస్తులు పూర్తి చేయించిన ఎంపీ**



పాల్వంచ, నవంబర్ 2: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను మరింత చురుగ్గా చేపట్టాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సూచించారు. సోమవారం పాల్వంచలోని 38వ డివిజన్‌లో బీఆర్ఎస్ కార్పొరేటర్ బత్తుల మధుచంద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం పాల్వంచ రూరల్ మండలం పాండురంగాపురంలో పట్టభద్రులను నేరుగా కలిసిన ఎంపీ, వారికి ఫారం-18 దరఖాస్తులు అందజేసి పూర్తి చేయించారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్ సింధూ తపస్వి, బీఆర్ఎస్ నాయకులు పూసల విశ్వనాథం, మల్లెల రవిచంద్ర, బీమా శ్రీధర్, రాజు గౌడ్, కొట్టి వెంకటేశ్వరరావు, అనుదీప్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ధూప దీప నైవేద్య అర్చకుల వేతనాలు పెంచాలి

**25 వేల వేతనంతో పాటు ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలి**

**తెలంగాణ రాష్ట్ర ధూప దీప నైవేద్య అర్చక సంఘం డిమాండ్**



హైదరాబాద్, నవంబర్ 02: దేవాదాయ శాఖ పరిధిలోని ధూపదీప నైవేద్య అర్చకుల వేతనాలను నెలకు కనీసం రూ.25,000లకు పెంచాలని, వారి ఉద్యోగాలను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ రాష్ట్ర ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాదు వాసుదేవ శర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాచిగూడ తుల్జా భవన్‌లో దౌలతాబాదు వాసుదేవ శర్మ అధ్యక్షతన అర్చక సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అర్చకుల భవిష్యత్తు కార్యాచరణ, వారు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా వాసుదేవ శర్మ మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ధూప దీప నైవేద్య పథకం కింద దాదాపు 6,570 మంది అర్చకులు గత 18 సంవత్సరాలుగా నిష్ఠతో సేవలందిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం అర్చకులకు రూ.6,000 గౌరవ వేతనం, ధూప దీప నైవేద్యాల ఖర్చుల నిమిత్తం రూ.4,000 ఇస్తోందని పేర్కొన్నారు. అయితే నిత్యావసర ధరలు గణనీయంగా పెరిగిన ప్రస్తుత కాలంలో ఈ మొత్తం ఏమాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా ప్రతి అర్చకుడికి నెలకు కనీసం రూ.25,000 వేతనం అందించాలని, గత 18 ఏళ్లుగా సేవలందిస్తున్న అర్చకులందరినీ రెగ్యులర్ చేసి పేస్కేల్ వర్తింపజేయాలని కోరారు. అత్యల్ప వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్చకుల పరిస్థితిని మానవీయ కోణంలో పరిగణించి, వేతనాలు పెంచి ఆదుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పోతులపాటి రామలింగేశ్వర శర్మ, గంగు కృష్ణచైతన్య, కొండూరి విశాలాక్షి, నందనం హరికిషన్ శర్మ, హరికీర్తి అమరేశ్వర శర్మ, వెంకట రమణచారి, పి.వెంకట్రావు, అర్జున్, మహంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

**ఖమ్మంలో నిరసన శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన డాక్టర్ గడల శ్రీనివాసరావు**

ఖమ్మం, నవంబర్ 2: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి, పరిష్కరించాలని జనసేన నాయకుడు డాక్టర్ గడల శ్రీనివాసరావు కోరారు. ఖమ్మంలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరసన తెలుపుతున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను ఆయన కలిసి సంఘీభావం ప్రకటించారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వారికి ఉద్యోగ భద్రత, న్యాయమైన వేతనాలు, మెరుగైన పని పరిస్థితులు కల్పించడం ప్రభుత్వ బాధ్యతని అన్నారు. గతంలో వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్‌గా పనిచేసిన సమయంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యలు, వాటి పరిష్కారానికి సంబంధించిన సూచనలను త్రిసభ్య కమిటీకి సమర్పించినట్లు తెలిపారు. అవసరమైతే ఎన్‌హెచ్ఎం జేఏసీ ప్రతినిధులతో కలిసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించకూడదని, వారి న్యాయమైన డిమాండ్లకు తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని డాక్టర్ గడల స్పష్టం చేశారు.

VOICE OF PRAJALU
వాయిస్ ప్రజల గొంతుక - నిజం కోసం.. ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
మంగళవారం 3 నవంబరు 2026




## NHM ఉద్యోగుల నిరవధిక సమ్మె 21వ రోజుకు చేరింది - నల్ల దుస్తుల్లో నిరసన ర్యాలీ

రాజన్న సిరిసిల్ల జిల్లా, నవంబర్ 02 (వాయిస్ టుడే): చీనవీ ఉద్యోగుల నిరవధిక సమ్మె సోమ వారం నాటికి 21వ రోజుకు చేరింది. తమ న్యాయమైన డిమాండ్ల ను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చీనవీ ఉద్యోగులు నల్ల దుస్తులు ధరించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పట్టణం లోని కొత్త బస్టాండ్ నుండి ప్రారంభమైన నిరసన ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా మీదుగా, గాంధీ చౌక్ వరకు సాగి, నేతన్న విగ్రహం వద్ద ముగిసింది. ఈ సందర్భం గా ఉద్యోగ లు ప్రభుత్వానికి వ్యతి రేకంగా నినాదాలు చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో చీనవీ ఉద్యోగులు స్రవంతి, లక్ష్మీ ప్రసన్న, నవీన్, ప్రియదర్శిని, సంతోష, మీరాయ, చందు, అంజలి, శ్వేత, వసంత, హేమ,మంజుల, అనిత తదితరులు పాల్గొన్నారు.




## అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల డిమాండ్లపై రాజన్న సిరిసిల్లలో ధర్నా

రాజన్న సిరిసిల్ల జిల్లా, నవంబర్ 2 (వాయిస్ టుడే): తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్, ఏఐటీయూసీరాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు అంగన్ వాడీ టీచర్లు, ఆయాలు ధర్నా చేసి, తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా ఇప్పటికీ వారిని రెగ్యులరైజ్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా టీచర్లకు, ఆయాలకు రూ. 18 వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.బీఎల్ఓ డ్యూటీలు రద్దు చేయాలని, సమ్మె కాలంలో కోల్పోయిన వేతనాలు చెల్లించాలని, పదవీ విరమణ తర్వాత నెలకు రూ. 10 వేల పెన్షన్ అమలు చేయాలని నాయకులు కోరారు. ప్రీ-స్కూల్ విధానం అమలు వల్ల అంగన్‌వాడీ వ్యవస్థ బలహీనపడే ప్రమాదం ఉందని పేర్కొంటూ, ప్రీ-స్కూల్ నిర్ణయాన్ని వెంటనే వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని, ప్రతి టీచర్, ఆయాకు రూ. 25 లక్షల ఇన్సూరెన్స్ కవరేజ్ కల్పించాలని, గ్రేడ్-2 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ల చేశారు. పదవీ విరమణ చేసిన టీచర్లు, ఆయాలకు అనుబంధ సంక్షేమ పథకాలు అందించాలని, ఆరోగ్య కార్డులు జారీ చేయాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, సమ్మె కాలంలో నమోదైన కేసులను ఎత్తివేయాలని కూడా వారు డిమాండ్ చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు ఎదురుగట్ల మమత, చొప్పరి అంజలి, కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు సంఘటితంగా పోరాటం కొనసాగిస్తామని నాయకులు ప్రకటించారు.



## ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

### ఐడీఓసీ ప్రజావాణికి 165 దరఖాస్తుల రాక

రాజన్న సిరిసిల్ల జిల్లా, నవంబర్ 02 (వాయిస్ టుడే): ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో సోమ వారం ప్రజావాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 165 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. త్వరితగతిన పరిష్కరిం చాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చే దరఖాస్తులు నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయం లో నిర్వహించిన ప్రజావాణి లో 06 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే వేములవాడ ఆర్డీఓ కార్యాలయం లో నిర్వహించిన ప్రజావాణి లో 06 దరఖాస్తు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.

## సరస్వతీ శిశు మందిర్‌లో ఘనంగా సువర్ణప్రాశన హోమం



కరీంనగర్,నవంబర్ 02(వాయిస్ టుడే): శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యం, ఆయురారోగ్యం మరియు శ్రేయస్సును ఆకాంక్షిస్తూ కోల అన్నారెడ్డి,ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ సువర్ణప్రాశన హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు సాంప్రదా యబద్ధంగా సువర్ణప్రాశన చుక్కలను వేశారు.ఈ కార్యక్రమంలో ఎలగందుల సత్యనారాయణ,గట్టు శ్రీనివాస్, బొడ్ల శ్రీనివాస్,కొత్తూరి ముకుందశ్, గట్టు రాంప్రసాద్,నడిపెల్లి దీన్ దయాల్ రావు,తాటిపల్లి రాజేశ్వర్ రావు,రాపర్తి శ్రీనివాస్,ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారని పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ తెలియజేశారు.

# బీజేపీ పాలకవర్గ అవినీతిపై బండి సంజయ్ సమాధానం చెప్పాలి!

### అవినీతి ఆరోపణలు నిజమైతే కార్పొరేటర్లను సస్పెండ్ చేస్తారా?

### రూ.100కోట్ల నిధుల ఖర్చుపై విచారణ జరిపించాలి

### బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరి శంకర్ సవాల్




కరీంనగర్,నవంబర్ 02(వాయిస్ టుడే): నగరపాలక సంస్థలో బీజేపీకి చెందిన మేయర్,డిప్యూటీ మేయర్,కార్పొరేటర్లపై వస్తున్న అవినీతి ఆరోపణలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరి శంకర్ డిమాండ్ చేశారు.ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి,బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత కార్పొరేటర్లను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారా? బ్లాక్‌లిస్టులో పెడతారా? లేక నైతిక బాధ్యత వహిస్తూ మీరు కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు.కరీంనగర్‌లోని మంకమ్మతోటలో ఉన్న మీకోసం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో గత ఎనిమిది నెలల 15 రోజులుగా చోటుచేసుకుంటున్న పరిణామాలపై ప్రజల్లో చర్చ జరుగుతున్నదని అన్నారు.మున్సిపల్ కార్పొరేషన్‌లో కీలక స్థానాల్లో ఉన్నవారిపై అవినీతి ఆరోపణలు వస్తుండటం ఆందోళనకరమని పేర్కొన్నారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సమావేశంలో నగరపాలక సంస్థ బీజేపీ పాలకవర్గ సభ్యులను ఉద్దేశించి ఎవరైనా అవినీతికి పాల్పడితే వారిని బ్లాక్‌లిస్టులో చేరుస్తానని వ్యాఖ్యానించడంపై చల్ల హరి శంకర్ ప్రశ్నలు సంధించారు.బీజేపీ పాలకవర్గ సభ్యులు అవినీతికి పాల్పడకపోతే కేంద్ర మంత్రి అలాంటి వ్యాఖ్యలు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు.బండి సంజయ్ వ్యాఖ్యలు చూస్తుంటే నగరపాలక సంస్థలో బీజేపీ నాయకులు అవినీతికి పాల్పడుతున్నారనే అనుమానం ప్రజల్లో కలిగే అవకాశం ఉందన్నారు.అవినీతి జరగకుంటే బ్లాక్‌లిస్టులో పెడతానని హెచ్చరించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు.ఈ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.నగరంలో జనరల్ ఫండ్, యూఏడీఎఫ్ నిధులు కలిపి సుమారు రూ.100 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు చెబుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదని హరి శంకర్ ఆరోపించారు.ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తున్నప్పుడు క్షేత్రస్థాయిలో అభివృద్ధి ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు.పనులకు శంకుస్థాపనలు చేసి కొబ్బరికాయలు కొట్టడం వరకే పరిమితమవుతున్నారని,ఆ తర్వాత పనులు ముందుకు సాగడం లేదని విమర్శించారు.నిధుల వినియోగం,పనుల కేటాయింపు,బిల్లుల చెల్లింపులపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లకు పనులు కేటాయించడం, బిల్లుల చెల్లింపుల విషయంలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై విచారణ చేపట్టాలని కోరారు.కాంట్రాక్టర్లను నేరుగా పిలిచి విచారిస్తే వాస్తవాలు బయటపడతాయని అన్నారు.పనులు పొందేందుకు కాంట్రాక్టర్లు కమీషన్లు చెల్లించాల్సి వస్తోందన్న ఆరోపణలపైనా అధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేశారు.ఎవరు కమీషన్లు అడుగుతున్నారు? కాంట్రాక్టుల కేటాయింపులో ఎలాంటి అక్రమాలు జరుగుతున్నాయి? అనే అంశాలను నిగ్గు తేల్చాలన్నారు.గత ఎనిమిది నెలల 15 రోజులుగా నగరంలో జారీ చేసిన భవన నిర్మాణ అనుమతుల వివరాలను అధికారుల నుంచి సేకరించి విచారణ జరపాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు సూచించారు.అనుమతులు పొందినవారిని నేరుగా సంప్రదించి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేశారా? అనే విషయాన్ని తెలుసుకోవాలని అన్నారు.ఈ వ్యవహారాలకు సంబంధించి తమ వద్ద ఆడియో,వీడియో రికార్డులు ఉన్నాయని వెల్లడించారు.తాము ఆధారాలు బయటపెట్టిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే విచారణ జరిపించి నిజానిజాలు తేల్చాలని హరి శంకర్ డిమాండ్ చేశారు.ఆరోపణలు నిజమని నిర్ధారణ అయితే సంబంధిత కార్పొరేటర్లను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ అనూప్ కుమార్, డివిజన్ అధ్యక్షులు ఆరె రవి,చేతి చంద్రశేఖర్,తొంటి రాజేందర్,రాజ్ కుమార్,బండ శ్రీకాంత్,పిట్టల శ్రీనివాస్, యూత్ ప్రధాన కార్యదర్శి గంగాధర చందు,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కలర్ సత్తన్న,మిడిదొడ్డి నవీన్,సత్తినేని శ్రీనివాస్,నాగుల కిరణ్, సైఫ్,ఇర్ఫాన్,విజ్ఞాన్ శ్రీనివాస్,సాయి, ఆవుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



## ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైన వివేకానంద కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్

కరీంనగర్,నవంబర్ 02(వాయిస్ టుడే):వివేకానంద డిగ్రీ మరియు పీజీ కళాశాలలో బి.ఎస్సీ (ఆనర్స్) విద్యార్థి మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ అవుదుర్తి వివేక్ వంశీ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో చూపిన చురుకైన భాగస్వామ్యం,క్రమశిక్షణ, అంకితభావం మరియు సేవా దృక్పథం ఈ ఎంపికకు నిదర్శనమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ నుండి 19 వ తేదీ వరకు అనురాగ్ యూనివర్సిటీ హైదరాబాద్ లో జరిగే ట్రైనింగ్ ప్రోగ్రాంలో ప్రతిభ చూపించిన వారిని 26 జనవరి రోజున ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్ కు ఎంపిక చేస్తారని తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్, ఏసిఓ బండి సంపత్ కుమార్,ఏవో బండి శ్రవణ్ కుమార్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు ధనపురి సాగర్,బి మహేశ్ ఎన్ శ్రీనివాస్, అధ్యాపకులు,విద్యార్థులు వివేక్ వంశీని అభినందించారు.



## ఢిల్లీలో పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన నగర కాంగ్రెస్ అధ్యక్షుడు

కరీంనగర్,నవంబర్ 02(వాయిస్ టుడే):ఢిల్లీలో పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను కరీంనగర్ అర్బన్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాహుల్ గాంధీ సభ విజయవంతంపై చర్చించారు.కరీంనగర్ జిల్లా నుండి బస్సులో 36 మంది,ఫ్లైట్ లో 24 మంది,ట్రైన్ లో 10 మంది పెద్ద ఎత్తున పాల్గొన్నట్లు, మంత్రివ పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో జరిగిన సమీకరణపై పీసీసీ అధ్యక్షులతో చర్చించారు. వైద్యులతో పాటు కార్పొరేటర్లు పర్వతం మల్లేశం, వరాల నర్సింగం,కాంతల జగన్ రెడ్డి,17వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కంకణాల అనిల్,ఇమ్రాన్ మహాత్,పెంట శేఖర్,ఇమ్రాన్ గని,ఆసిఫ్,శ్రీకాంత్, గట్టు ప్రసాద్,కొత్తపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గుర్తి మురళి,యూత్ కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు జారిపోతుల వాసు కలిశారు.

## ఎల్.ఎల్.బి విద్యార్థిని చంద్రకళ ఆత్మహత్య పై సమగ్ర విచారణ జరిపించాలి

### ఎస్ఎఫ్ఐ,పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్,బత్తుల రాజు




కరీంనగర్,నవంబర్ 02(వాయిస్ టుడే): భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ,పిడిఎస్యు మరియు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ ఎల్.ఎల్.బి విద్యార్థిని చంద్రకళ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది,వారి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ,సమగ్ర విచారణ జరిపించాలి అని మార్చురీ గది ముందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్,పిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు బత్తుల రాజు మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీ ఎల్.ఎల్.బి విద్యార్థిని చంద్రకళ ఆత్మహత్యకు తన గదిలో ఉరివేసుకొని పాల్పడడం అనుమానాస్పదంగా ఉందని వారు అన్నారు.ఈ మృతి పట్ల తీవ్ర అనుమానాలు ఉన్నాయని యూనివర్సిటీ సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండటమే ముఖ్య కారణంగా కనబడుతుంది విధుల్లో ఉండవలసిన కేర్ టేకర్ మరియు వార్డెన్లు నిర్లక్ష్యంగా ఉండడం ద్వారా ఈ ఘటన జరిగిందని అన్నారు. దీనికి పూర్తి బాధ్యత వహిస్తూ వైస్ చాన్సలర్ ఉమేష్ కుమార్ విధుల్లో ఉన్న వారిని తొలగించి,అలాంటి ఘటన జరగడానికి గల కారణాలు ఇంకా వేరే ఏమైనా ఉన్నాయా అని దానిపైన సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సహకారం అందించాలని మరియు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.స్పందించిన వీసీ ఉమేష్ కుమార్ మూడు లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించారు,వారి ఖర్చులకు భరిస్తామని కూడా హామీ ఇచ్చారు. దానితోపాటు యూనివర్సిటీలో ఔట్సోర్సింగ్ లో వారి కుటుంబంలో నుండి ఒకరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని వైస్ చాన్సలర్ ఉమేష్ కుమార్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సాయి,రిషి,పి డి ఎస్ యు నాయకులు యోగేందర్ శివ,నరేష్,మారుతి పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రిలో కామినేని సరిత జ్ఞాపకార్థం అన్నదానం

కరీంనగర్,నవంబర్ 02(వాయిస్ టుడే): ఆంధ్రప్రభ రిపోర్టర్ కామినేని మధు సతీమణి కామినేని సరిత పెద్దకర్మ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు మానవతా దృక్పథంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సహాయకులు,నిరుపేదలు మరియు ఆసుపత్రికి వచ్చిన వారికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న వారికి భోజనం అందజేసి,వారి ఆకలి తీర్చడం ద్వారా కామినేని సరిత గారి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.మరణించిన తమ కుటుంబ సభ్యురాలి జ్ఞాపకాలను స్మరించుకుంటూ,ఆపదలో ఉన్న వారికి అన్నం పెట్టడం ద్వారా మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమం ద్వారా సేవాభావం, దాతృత్వం మరియు సామాజిక బాధ్యతను చాటిన కామినేని కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.కామినేని సరిత ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు ప్రార్థించారు.

# చిగురుమామిడిని కరువు మండలంగా ప్రకటించాలి

**రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా?**

**తహసిల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ మహాధర్నా**

**కరువు మండలంగా ప్రకటించకుంటే మంత్రి పొన్నం ప్రభాకర్ రాజీనామా చేయాలి: కొత్త శ్రీనివాస్ రెడ్డి**

**ప్రకృతి కరువు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు అంటూ నాయకుల ఆగ్రహం**



చిగురుమామిడి, నవంబర్ 2 (వాయిస్ ఆఫ్ ప్రజలు): దశాబ్దాలుగా మెట్ట ప్రాంతంగా కొనసాగుతూ, సాగునీటి వసతుల కొరతతో వ్యవసాయ రంగం తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న చిగురుమామిడి మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో సోమవారం తహసిల్దార్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

ఈ సందర్భంగా కొత్త శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. స్థానికంగా ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత నియోజకవర్గ పరిధిలోని చిగురుమామిడి మండలంలో కరువు పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా మెట్ట ప్రాంతంగా ఉన్న ఈ మండలంలో సాగునీటి వసతులు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. రైతుల కష్టాలను గుర్తించి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించలేని పక్షంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ధర్నాలో పాల్గొన్న నాయకులు ఆరోపించారు. ప్రాజెక్టుల పనులను నిర్లక్ష్యం చేస్తూ, మరోవైపు వరి సాగు చేయవద్దంటూ రైతులను ఆందోళనకు గురిచేయడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే వర్షాధార వ్యవసాయంపై ఆధారపడిన రైతులు సాగునీటి కొరతతో సతమతమవుతుంటే, వారి పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మార్చేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని విమర్శించారు.

ప్రకృతి వైపరీత్యాల కంటే ప్రభుత్వ నిర్లక్ష్యమే రైతులకు శాపంగా మారిందని, ప్రస్తుతం మండలంలో నెలకొన్న పరిస్థితులు ప్రకృతి కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఏర్పడిన కరువని నాయకులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

చిగురుమామిడిని వెంటనే కరువు మండలంగా ప్రకటించడంతో పాటు, రైతులకు తగిన కరువు సహాయం అందించేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి తక్షణమే విడుదల చేయాలని నాయకులు కోరారు. వ్యవసాయ రంగాన్ని ఆదుకునేలా సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, రైతులకు పంట నష్టపరిహారం, ఇతర ప్రభుత్వ సహాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేంతవరకు, మండల అభివృద్ధి మరియు రైతాంగ ప్రయోజనాల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసిల్దార్ కనకయ్యకు అందజేశారు.

**భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు**

ఈ మహాధర్నాలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, మాజీ సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి, సర్పంచ్ బోయిని రమేష్, మాజీ మండల అధ్యక్షుడు రామోజు కృష్ణమాచారి, మాజీ సర్పంచులు సన్నీల్ల వెంకటేష్, బెజ్జంకి లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు మిట్టపల్లి మల్లేశం, కత్తుల రమేష్ యాదవ్, పెసరి రాజేశం, హనుమండ్ల సత్యనారాయణ, బుర్ర తిరుపతి గౌడ్, ఎస్.కె. సిరాజ్, ఉపసర్పంచులు మేడబోయిన రాజు, కాసర్ల హరీష్, కాశబోయిన రాజు యాదవ్, శ్యామకూర సంపత్ రెడ్డి, నాగేల్లి రాజిరెడ్డి, చెప్యాల నారాయణరెడ్డి, తాటికొండ సందీప్ రెడ్డి, కత్తుల ప్రశాంత్, అంజిరెడ్డి, సిద్దెంకి రాయమల్లు, తోట శ్రీనివాస్, చెరుకు సంజీవ్, కిష్టారెడ్డి, వార్డు సభ్యుడు లక్ష్మయ్య, పరిపాటి రవీందర్ రెడ్డి, బండారి మల్లేశం, పాండవుల సంపత్, మ్యాదరవేణి ప్రవీణ్ యాదవ్, బిళ్ళ చంద్రరెడ్డి, మహంకాళి కొమురయ్య, కాలువల సంపత్ రెడ్డి, మల్లికార్జున్, షరీఫ్, చెరుకు హరీష్, సతీష్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అల్పాహార పథకం ప్రారంభించిన సర్పంచ్ ప్రమీల



నర్సాపూర్ (వాయిస్ టుడే): హత్నూర మండలంలోని నస్తీపూర్ గ్రామంలో సోమవారం నాడు ప్రాథమిక పాఠశాలలో అల్పాహా పథకాన్ని సర్పంచ్ ప్రమీల సాయిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రమీల సాయిలు ఉప సర్పంచ్ మహేందర్ పటేల్ మాట్లాడుతూ పల్లెల్లో కూలీ పనులు చేసుకునే తల్లులు పిల్లలకు అల్పాహారం ఇవ్వకపోవడం చేత అర్థాకలితో విద్య మీద శ్రద్ధ లేకపోవడం వల్ల చదువులో వెనుకబడడం జరుగుతుందన్నారు.ప్రభుత్వం నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన ఆరోగ్యం కోసం ఆహారం అంతే ముఖ్యమని భావించి ఈ అల్పాహార పథకం మొదలు చేసామన్నారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు లోకనాధం మాట్లాడుతూ 1వ రోజు దోష, చట్నీ సాంబార్,2వ రోజు మిల్లెట్ ఇడ్లీ, సాంబార్,3వ రోజు పూరీ,మిక్స్డ్ వెజ్ కర్రి 4వ రోజు బోండా, చట్నీ సాంబార్ 5వ రోజు ఇడ్లీ, చట్నీ సాంబార్ 6వ రోజు ఉక్మా, చట్నీ సాంబార్ ఇస్తామన్నారు.చదువులో రాణించాలంటే ప్రతి రోజు పిల్లలను బడికి తల్లిదండ్రులు తప్పకుండా పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రమీల సాయిలు, ఉపసర్పంచ్ మహేందర్ పటేల్ పంచాయతీ కార్యదర్శి యాదయ్య ప్రధానోపాధ్యాయులు లోకనాధం, ఉపాధ్యాయులు నరేష్, లక్ష్మీ బాయి, బాలమ్మ, విద్యార్థులు గ్రామస్తులుపాల్గొన్నారు.



## ఆలయ నిర్మాణానికి అండగా నిలిచిన అల్లం దంపతులు

**- భక్తితో ఇరవై వేల ఆర్థిక సాయం**

సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా నవంబర్ 2 వాయిస్ టుడే: సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి సుల్తానాబాద్ పట్టణం గాంధీనగర్‌కు చెందిన అల్లం భాగ్యలక్ష్మి సత్యనారాయణ దంపతులు ఇరవై వేల రూపాయలు విరాళం అందజేశారు.గ్రామంలో చేపట్టిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో దంపతులు ఈ విరాళాన్ని అందించారు. ఆలయ పునర్నిర్మాణం ఆవశ్యకతను వివరించగా, వారు సానుకూలంగా స్పందించి వెంటనే ఇరవై వేల ఆర్థిక సహాయాన్ని అందించడం పట్ల ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న వారు హర్షం వ్యక్తం చేశారు.విరాళం అందించడంలో యువ సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపకులు తుమ్మరాజ్ కుమార్ ముఖ్యపాత్ర పోషించారు. ఆయన చొరవతో అల్లం సత్యనారాయణ దంపతులను కలిసి ఆలయ పునర్నిర్మాణం గురించి వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కొల్లూరి సంతోష్ కుమార్, కరెంగుల హరీష్, కరెంగుల అజయ్, కోడి సాయి కుమార్ పాల్గొన్నారు.



## నర్సాపూర్ నియోజకవర్గంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత రెడ్డి

నర్సాపూర్ (వాయిస్ టుడే) : రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పిఎసిసి నర్సాపూర్ ఆదివారంలో ఏర్పాటు చేసిన వారి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సునీత రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు అనంతరం కాగజ్ మద్దూర్ నర్సాపూర్ పెద్ద చింతకుంట కాజీపేట గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఆమె సూచించారు కొనుగోలు ప్రక్రియలు రైతులకునర్సాపూర్ నియోజకవర్గంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత రెడ్డి

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పిఎసిసి నర్సాపూర్ ఆదివారంలో ఏర్పాటు చేసిన వారి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సునీత రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు అనంతరం కాగజ్ మద్దూర్ నర్సాపూర్ పెద్ద చింతకుంట కాజీపేట గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఆమె సూచించారు కొనుగోలు ప్రక్రియలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆమె సూచించారు ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్ పిఎసిఎస్ చైర్మన్ రాజు యాదవ్ పెద్ద చింతకుంటసర్పంచ్ శివకుమార్ తోపాటు పెద్ద చింతకుంట కొనుగోలు కేంద్రం ఇంచార్జ్ ఆంజనేయులు పి ఎస్ సి ఎస్ సి సిబ్బంది వెంకటస్వామి శ్రీనివాస్ కుమార్ గోపాల్ పలు పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆమె సూచించారు ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్ పిఎసిఎస్ చైర్మన్ రాజు యాదవ్ పెద్ద చింతకుంటసర్పంచ్ శివకుమార్ తోపాటు పెద్ద చింతకుంట కొనుగోలు కేంద్రం ఇంచార్జ్ ఆంజనేయులు పి ఎస్ సి ఎస్ సి సిబ్బంది వెంకటస్వామి శ్రీనివాస్ కుమార్ గోపాల్ పలు పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సుల్తానాబాద్ బాలసదన్‌లో శిశు గృహం ప్రారంభం!

**- శిశు గృహంలో మెరుగైన వసతులు కల్పించాలి!**

**- పిల్లల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి!**

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా నవంబర్-02 వాయిస్ టుడే: సంరక్షణ, రక్షణ అవసరమైన చిన్నారుల భద్రత, ఆరోగ్యం, సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులకు సూచించారు. శిశుగృహలో పిల్లలకు మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన పోషకాహారం, అవసరమైన వైద్య సదుపాయాలు, తగిన సంరక్షణ అందించాలని ఆదేశించారు.సోమవారం సుల్తానాబాద్‌లోని బాలసదన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిశుగృహాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా శిశు గృహలో కల్పించిన సౌకర్యాలను పరిశీలించి, చిన్నారులకు అందించే సంరక్షణ, వసతుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తల్లిదండ్రుల సంరక్షణకు నోచుకోని, వదిలివేయబడిన, అనాథ, సంరక్షణ అవసరమైన పసిపిల్లలకు సురక్షితమైన ఆశ్రయం కల్పించడమే శిశుగృహ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. జననం నుంచి ఆరు సంవత్సరాల లోపు వయస్సు గల చిన్నారులకు ప్రేమపూర్వక సంరక్షణ, పోషకాహారం, వైద్య సదుపాయాలు, ఆరోగ్య పరిరక్షణతో పాటు వయస్సుకు తగిన అభివృద్ధి అవకాశాలను ఈ కేంద్రం ద్వారా అందించనున్నట్లు తెలిపారు.చిన్నారుల భద్రత, ఆరోగ్య పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పిల్లలకు ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు, వారి అవసరాలకు అనుగుణంగా మెరుగైన సదుపాయాలు అందుబాటులో ఉంచాలని అధికారులకు తెలిపారు.చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ ద్వారా కుటుంబ వాతావరణం శిశు గృహలో సంరక్షణ పొందుతున్న అర్హులైన చిన్నారులకు చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ ద్వారా కుటుంబ వాతావరణాన్ని కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం కూడా ఈ కేంద్రం లక్ష్యాలలో భాగమని అధికారులు తెలిపారు. చిన్నారుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, సీడీపీఓ అనిత, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, జిల్లా బాలల సంరక్షణ అధికారి జితేందర్, బాలసదన్ సిబ్బంది పాల్గొన్నారు..



## ముదిరాజులను బిసి డిలోనే కొనసాగించాలి

రాయికల్ (వాయిస్ టుడే): రాయికల్ పట్టణంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలు గంగా పుత్ర మత్స్య పరిశ్రామిక సహకార సంఘాల సొసైటీల ఆధ్వర్యంలో తహసీల్దార్ నాగార్జున కు వినతి పత్రం సమర్పించారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముదిరాజులను బిసి ఎ చేర్చాలని చేసిన వాఖ్యలు వెనక్కి తీసుకోవాలని అన్నారు వారు మాట్లాడుతు బిసి ఎ లో ఇప్పటికే 58 కులాలు ఉన్నాయి అని కేవలం 7% శాతం రిజర్వేషన్ తో ఇబ్బందులు పడుతున్నామని సరియైన రాజకీయ ఉద్యోగ సామజిక అవకాశాలు సరిగ్గా రావడం లేదని ముదిరాజులను చేర్చితే మరింత ఇబ్బంది పడుతామని గతంలో నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ముదిరాజు లను బిసి ఎ లో చేర్చాలని వాఖ్యలు చేయగా ఆనాడే హైకోర్టు కొట్టివేసింది అని గుర్తు చేశారు ప్రభుత్వం బిసి కులాల మధ్య చిచ్చు పెట్టే ఇలాంటి ఆలోచనలు తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సంఘం చెర్లకొండాపూర్ రాయికల్ అధ్యక్షులు అర్మురి లక్ష్మినారాయణ ఉపధ్యక్షులు కల్లెడ శేఖర్ మరియు ఇతర గ్రామాల సంఘ సభ్యులు రాజేష్ ,ఉట్నూరి హన్మండ్లు దేశవేణి నరేష్ ,తోకల రాజారెడ్డి ,యెల్ల చిన్న నర్సయ్య ,బండారి సుధాకర్ గుమ్ముల రాజేశం ,పల్లికొండ గంగారాజం పల్లికొండ గంగారాజం నుతికట్లా వెంకటి కల్లెడ బీమారాజ్ తదితరులు పాల్గొన్నారు.



## అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**- కౌన్సిలర్ ఉట్ల వరప్రదీప్**

సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా నవంబర్-02: సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణంలోని యాదవనగర్ అంగన్‌వాడీ పాఠశాలలో ఏడవ వార్డు కౌన్సిలర్ ఉట్ల వర ప్రదీప్ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ ఉట్ల వర ప్రదీప్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం, నిత్యావసర సరుకులతో పాటు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు విజయ్, చిరంజీవి, సంతోష్, వెంకటేష్, రత్నం, సరక్క, జీపీఓ మహేందర్ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్, వార్డు ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు..

## అమృత్ 2.0 పనుల్లో ది కాంట్రాక్టర్ నిర్లక్ష్యం - చర్యలకు వినతి

రాయికల్( వాయిస్ టుడే): రాయికల్ పట్టణంలోని తొమ్మిదవ వార్డు కౌన్సిలర్ బత్తిని మహేశ్వరి అమృత్ 2.0 పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై ప్రజావాణి లో పిర్యాదు చేశారు. ఇట్టి సందర్భంగా ఆమె మాట్లాడుతు పట్టణములో నిర్మాణములో ఉన్న అమృత్ 2.0 ప్రాజెక్టు పనులు గత కొన్ని రోజులుగా కాంట్రాక్టరు నిలిపివేసినారు. పట్టణములోని 9వ వార్డు పైప్లైన్ వేయడానికి సి.సి. రోడ్డు తవ్వి గత కొన్ని నెలలుగా అలాగే వదిలేసినారు. దానితో ప్రజలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవలసి వస్తున్నది. తరచు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వార్డు ప్రజల నుండి ఫిర్యాదులు వస్తున్నాయి. అమృత్ 2.0 పనులలో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టరుపై తగిన చర్యలు తీసుకొని ఇట్టి పనులు సత్వరమే పనులు పూర్తి చేయించి ప్రజలకు మేలు చేయగలరని ఆమె విజ్ఞప్తి చేసారు ఆమెతో పాటు నాయకులు బత్తిని నాగరాజు ఉన్నారు .



## అమ్మవారి యాగానికి అందరం ఒక్కటవుదాం..
## ఆధ్యాత్మిక వైభవానికి బాటలు వేద్దాం.!

**వస్తు రూపంలోనైనా.. ధన రూపంలోనైనా మీ సహకారం అందించండి.**
**ప్రతి విరాళానికి రసీదు, ప్రతి రూపాయికి**
**పారదర్శక లెక్కలు చూపిస్తాం. యాగం కమిటీ సభ్యులు**

పినపాక నవంబర్ 2 (వాయిస్ టుడే): పినపాక నియోజకవర్గం , డిసెంబరు నెలలో జరగబోయే శ్రీ శ్రీ శ్రీ శత రుద్ర సహిత మహా చండీ యాగం నిర్వహణకు మనస్ఫూర్తిగా సంకల్పం చేసుకోవడం జరిగింది. ఈ మహోత్తరమైన కార్యక్రమం లోక కళ్యాణం కోసం, మన గ్రామ సుభిక్షం కోసం, రోగభయ పీడల పరిహారం కోసం నిర్వహించబడుతుంది.ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, మన గ్రామం అన్ని విధాలా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ ఈ మహాయాగాన్ని నిర్వహించేందుకు సంకల్పించాము. మన గ్రామంలోని ప్రతి ప్రాంతం నుండి కొంతమంది భక్తులు ఈ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరుకుంటున్నాము. ఈ మహత్తర కార్యక్రమంలో మీరు కూడా భాగస్వాములు కావాలని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాము. మీకు వీలైన విధంగా వస్తు రూపంలో గానీ, ధన రూపంలో గానీ సహాయ సహకారాలు అందించి ఈ మహాయాగం విజయవంతం కావడానికి మీ వంతు తోడ్పాటును అందించాలని కోరుకుంటున్నాము.

**విరాళాల సేకరణలో పూర్తి పారదర్శకత..**

మీరు అందించే ధన రూపేణా లేదా వస్తు రూపేణా విరాళాలకు సంబంధించి కమిటీ సభ్యుల వద్ద నుండి తప్పనిసరిగా రసీదు ఇవ్వడం జరుగుతుంది. ఈ మహత్తర కార్యక్రమం నిమిత్తం సేకరించిన ప్రతి రూపాయిని యాగ నిర్వహణకు మాత్రమే వినియోగిస్తామని, ప్రతి రూపాయికి సంబంధించిన పూర్తి లెక్కలను పారదర్శకంగా తెలియజేస్తామని కమిటీ తరఫున హామీ ఇస్తున్నాము.

ఇలాంటి మహోత్తరమైన కార్యక్రమంలో పాల్గొనే అవకాశం రావడం కూడా పూర్వజన్మ సుకృతమే, యోగదాయకమే కదా. అందరి సహకారంతో, అమ్మవారి ఆశీస్సులతో ఈ మహాయాగాన్ని విజయవంతం చేద్దాం. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై, ప్రతి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమం లో కమిటీ సభ్యులు ముత్తవరపు రాజశేఖర్, దేవులపల్లి సాయి కిరణ్ శర్మ, కళ్యాణ్, రాజు, గోవర్ధన్, బాలు, రవికిరణ్, ప్రమీల, భవానీ, అనిత, ఇందు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా చిన్నారి మొదటి పుట్టినరోజు వేడుకలు

**చిన్నారిని ఆశీర్వదించిన జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు**

జహీరాబాద్ వాయిస్ టుడే నవంబర్ 02: ఝరాసంగం మండలంలోని 9వ వార్డు సభ్యుడు నవీన్ కుమార్తె మొదటి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన స్థానికజహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు చిన్నారిని ఆశీర్వదించి, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, మాజీ ఎంపీపీ సంగమేశ్వర్, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు జగదీష్, ఝరాసంగం సర్పంచ్ వినోద బాల్ రాజ్, ఉప సర్పంచ్ అనిల్, తుమ్మన్‌పల్లి సర్పంచ్ సోహేల్, నాయకులు శశివర్ధన్ రెడ్డి, నాగేశ్వర్, సజ్జన్, విజయ్, ఉల్లాస్, సాగర్ తదితరులు పాల్గొని చిన్నారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



## మలేరియా నివారణపై ల్యాబ్ టెక్నీషియన్లకు ప్రత్యేక శిక్షణ

కమాన్ బజార్(ఖమ్మం): మలేరియా నిర్మూలనే లక్ష్యంగా ఖమ్మం జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్లకు మలేరియా, ఇతర వ్యాధులపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పాత డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఈ శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా 2030 నాటికి మలేరియా నిర్మూలన లక్ష్య సాధనలో భాగంగా ల్యాబ్ టెక్నీషియన్లు నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. మలేరియా బ్లడ్ స్మియర్స్ యాక్టివ్, పాసివ్, జీరో ఫాలో అప్ కలెక్షన్లు, స్టెయినింగ్ ప్రక్రియ, మైక్రోస్కోపిక్ పరీక్షలు, చికిత్సా విధానం, రిపోర్టింగ్‌పై శిక్షణ ఇచ్చారు. అలాగే మైక్రోస్కోపుల ద్వారా ప్లాస్మోడియం ఫాల్సిపారం, ప్లాస్మోడియం వైవాక్స్ పరాన్నజీవులకు సంబంధించిన రింగ్, ట్రోఫోజోయిట్, స్కిజాంట్, గామిటోసైట్ దశలను ప్రత్యక్షంగా చూపించి వాటిని గుర్తించే విధానాన్ని వివరించారు. గతంలో శిక్షణ పొందిన ట్రైయినర్లు జియా, నాగేష్, రామారావు, అజహర్ శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో డీఎంవో వెంకటేశ్వర్లు, ఏఎంఓ వేణుగోపాల్‌తో పాటు జిల్లాలోని వివిధ పీహెచ్‌సీలకు చెందిన ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

# హామీల అమలులో అట్టర్ ఫ్లాప్ అయిన కాంగ్రెస్

**మాజీ జెడ్పీ చైర్మన్**
**-- దావ వసంత సురేష్**



రాయికల్( వాయిస్ టుడే): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది. ముఖ్యంగా రేవంత్ రెడ్డి ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, రైతులకు ఇచ్చిన హామీలు, పేదలకు అందిస్తామన్న సంక్షేమ పథకాలు కేవలం ప్రచారానికే పరిమితమయ్యాయి. వంద రోజులోనే అమలు చేస్తామని చెప్పిన హామీలు నేటికీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ గారు ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను కొనసాగించడంలో కూడా ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. పేదల సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని అర్ధాంతరంగా నిలిపివేయడంతో ఎంతోమంది నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జగిత్యాల నియోజకవర్గంలోని బోర్నపల్లి లో గృహలక్ష్మి పథకం కింద ఇల్లు మంజూరవుతుందన్న ఆశతో అప్పులు చేసి ఇంటి నిర్మాణం ప్రారంభించిన నిరుపేద సుమన్ వంటి వారికి నేడు తీవ్ర నిరాశే మిగిలింది. ప్రభుత్వం మారుతుందనే విషయం తెలియక కాదు.. కానీ ఒక ప్రభుత్వంపై నమ్మకంతో అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్న పేదల పరిస్థితి ఏమిటి? వారి బాధ్యత ఎవరు తీసుకుంటారు? మధ్యలో ఆగిపోయిన వారి ఇళ్ల నిర్మాణాలను ఎవరు పూర్తి చేస్తారు?

ప్రభుత్వాలు మారవచ్చు.. పార్టీలు మారవచ్చు.. కానీ ప్రజల కోసం పనిచేయాల్సిన పాలకుల బాధ్యత మాత్రం మారకూడదు. గత ప్రభుత్వం ప్రారంభించిన సంక్షేమ పథకాలను కొనసాగించాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వంపై ఉంటుంది. రాజకీయ కక్షలకు, ప్రచార ఆర్భాటాలకు పేదల సంక్షేమాన్ని బలి చేయడం సరైన పాలన అనిపించుకోదు. రైతులకు , పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో, మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోతోంది. గ్రామాల్లో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. అర్హులైన పేదలకు పథకాలు అందడం లేదు. రైతులకు భరోసా కల్పించే పరిస్థితి కనిపించడం లేదు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదల బతుకులు మారతాయని ఆశించిన ప్రజలకు నేడు నిరాశే మిగిలింది. మార్పు వస్తుందని ఆశిస్తే.. పేదల జీవితాల్లో మరిన్ని కష్టాలు, అప్పులు, ఆందోళనలు పెరిగాయి. రేవంత్ రెడ్డి గారూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడం మీ బాధ్యత కాదా? గృహలక్ష్మిపై నమ్మకంతో ఇళ్లు కట్టుకున్న సుమన్ వంటి నిరుపేదలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? ప్రజలకు మాటలు కాదు.. చేతల్లో పాలన కావాలి. హామీలతో కాలం గడపకుండా, నిలిచిపోయిన సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించి, అర్హులైన పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం.



# ఆర్ ఎం ప్రసాద్ కి ఇండియన్ గ్లోరీ అవార్డు

ఖమ్మం , నవంబర్ 2 ( వాయిస్‌టుడే ): నృత్యాన్ని తన శ్వాసగా, తన జీవితంగా మలచుకుని 30సంవత్సరాలుగా నిర్విరామంగా నృత్య రంగంలో సేవలందిస్తున్న నృత్య దర్శకులు, ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల సాంస్కృతిక అధ్యాపకుడు ఆర్ఎం ప్రసాద్ కి ప్రతిష్టాత్మక ఇండియన్ గ్లోరీ అవార్డు లభించింది. కళారత్న మూవీస్, రాజు ఎంటర్టైనర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో సినీ నటుడు సుమన్ ఆర్ఎం ప్రసాద్ కు ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా నటుడు సుమంత్ తో పాటు పలువురు ప్రముఖులు మాట్లాడుతూ మూడు దశాబ్దాల పాటు ఎంతో మంది ఔత్సాహిక కళాకారులను తీర్చిదిద్దుతూ వేలాది మంది విద్యార్థులకు నృత్యంలో మెళకువలు నేర్పించారన్నారు. కళా రంగానికి ఆయన చేసిన కృషి నీ కొనియాడారు. డాన్స్ అంటే కేవలం స్టెప్పులు మాత్రమే కాదని అది ఒక క్రమశిక్షణ, ఒక సంస్కారం అని తన శిష్యులకు నిరూపించారన్నారు. ఎన్నో వేదికలపై తనదైన ముద్ర వేసి ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నప్పటికీ ఈగ్లోరీ అవార్డు ఆయన 30 ఏళ్ల సుదీర్ఘ కళా ప్రయాణానికి దక్కిన గొప్ప గుర్తింపు అని అభినందించారు. కష్టపడి పనిచేస్తే కళ ఎప్పటికైనా గుర్తిస్తుందని ఆయన నిరూపించారన్నారు. రాబోయే రోజుల్లో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మరెంతో మంది కళాకారులను తయారు చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆర్ ఎం ప్రసాద్ ను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటులు సుమన్, సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, వివిఎన్ ఆదిత్య, సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, హాస్యనటులు జెన్నీ, వందే భారత్ దర్శకులు, ప్రముఖ మిమిక్రీ కళాకారులు మల్లం రమేష్, నటుడు, దర్శకులు, మెజీషియన్ రామడుగు వసంత కుమార్, కమెడియన్ యాంకర్ మొగిలి తదితరులు పాల్గొన్నారు.

**ప్రియదర్శిని విద్యాసంస్థల అధినేత నవీన్ బాబు అభినందనలు...**

30 సంవత్సరాలుగా విద్యార్థులకు నృత్యాలు నేర్పిస్తూ ఎన్నో అవార్డులు రివార్డులు సాధించిన తమ కళాశాల కల్చరల్, డాన్స్ మాస్టర్ ఆర్ఎం ప్రసాద్ కు ఇండియన్ గ్లోరీ అవార్డు– 2026 రావడం అభినందనీయమని ప్రియదర్శిని విద్యా సంస్థల అధినేత డాక్టర్ కె నవీన్ బాబు అన్నారు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అవార్డు గ్రహీత ఆర్ ఎం ప్రసాద్ ను నవీన్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి గోపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా నవీన్ బాబు మాట్లాడుతూ 30సంవత్సరాలుగా విద్యార్థులకు డాన్స్ నేర్పిస్తూ ఎన్నో అవార్డు తెచ్చి ఖమ్మం ఖ్యాతిని తెలంగాణలో నెంబర్ వన్ గా చేసినందుకుగాను ఆర్. యన్.ప్రసాద్ కి ఈ అవార్డు దక్కినందన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించడంతో పాటు జాతీయస్థాయిలో గుర్తింపు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి.. ఇద్దరికి గాయాలు

సత్తుపల్లి: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతిచెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీ–జీఎం కార్యాలయం మధ్య సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనుబల్లి మండలం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన కుర్సం తిరుపతయ్య, అచ్చమ్మ దంపతుల కుమారుడు రాము (25), అదే గ్రామానికి చెందిన పద్దం రాధాకృష్ణ, కాకా నరసింహారావు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం గ్రామంలో వాలీబాల్ ఆడిన అనంతరం ముగ్గురూ కలిసి సత్తుపల్లికి వచ్చి బిర్యానీ తిన్నారు. అనంతరం ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా కిష్టారం ఓసీ–జీఎం కార్యాలయం మధ్య గుర్తు తెలియని వాహనం వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాము అక్కడికక్కడే మృతిచెందగా.. రాధాకృష్ణ, నరసింహారావు గాయపడ్డారు. క్షతగాత్రులను సత్తుపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.



## విద్యార్థులకు భగవద్గీత పోటీలు

ఖమ్మం: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్ నిర్వహించిన భగవద్గీత పోటీలకు అనూహ్య స్పందన లభించింది. ఖమ్మం నగరంలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలకు చెందిన 774 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ పోటీల ద్వారా విద్యార్థుల్లో మానసిక వికాసం, క్రమశిక్షణ, జ్ఞాపకశక్తి, నైతిక విలువలు పెరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వెంకట్ రాణా ప్రతాప్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ నగర్ భూములపై ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండిస్తున్నాం!

**పేదల భూములను ప్రైవేట్ ఆస్తిగా ఎలా పేర్కొంటారు?**

**బీజేపీ పశ్చిమనియోజకవర్గ నేత రావు పద్మారెడ్డి**

**భూ వ్యవహారంపై ఆధారాలతో వాస్తవాలు వెల్లడిస్తాం..**
**పేదల పక్షాన పోరాటం కొనసాగిస్తాం**



హనుమకొండ, నవంబర్ 2 (వాయిస్ టుడే): కాజీపేట పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న వైఎస్సార్ నగర్ కాలనీలోని భూములపై స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి రావు పద్మారెడ్డి తెలిపారు. సర్వే నంబర్లు 70, 71లో సుమారు 30 ఏళ్లుగా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేదల భూములను ప్రైవేట్ ఆస్తిగా పేర్కొనడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో భూ ఆక్రమణలపై మాట్లాడే కాంగ్రెస్ నాయకులు, కాజీపేటలో మాత్రం ప్రైవేట్ వ్యక్తులకు మద్దతుగా నిలుస్తున్నారని రావు పద్మారెడ్డి విమర్శించారు. వైఎస్సార్ నగర్ భూముల విషయంలో పేదలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**పేదలకు అప్పుడెందుకు పట్టాలు ఇవ్వలేదు?**

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ పేదలకు పట్టాలు ఎందుకు అందజేయలేదని రావు పద్మారెడ్డి ప్రశ్నించారు. అప్పుడే పట్టాలు ఇచ్చి ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని వ్యాఖ్యానించారు. ఇప్పుడు పేదల పట్ల సానుభూతి వ్యక్తం చేయడం సరైంది కాదని విమర్శించారు.

**పేదలకు ఇళ్లు నిర్మించాలి..**
**బీజేపీ పోరాటం కొనసాగుతుంది..**

ప్రభుత్వానికి చెందాల్సిన సీలింగ్ ఎక్సెస్ భూమిలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రావు పద్మారెడ్డి డిమాండ్ చేశారు. మిగిలిన స్థలంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్ నగర్ భూములకు సంబంధించిన పూర్తి ఆధారాలను త్వరలోనే మీడియా ద్వారా ప్రజల ముందుంచుతామని తెలిపారు. పేదల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని, ఈ పోరాటంలో బీజేపీ వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని రావు పద్మారెడ్డి స్పష్టం చేశారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**